ఫిబ్రవరి — ఏప్రిల్ 1968

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

(త్రైమాసిక)

కళాశాల విద్యార్థుల

స్వచ్ఛంద కవితారచన పోటీ ఫలితాలు

వారి

మేధా నైపులూ

నైతిక బాధ్యతలూ

భాషా చర్చ
(మానవుడి మూల భాషలు ఏవి?)

'సుమనో ధార్మిక వేల'
('ఖడ్గ సృష్టి' సమీక్ష సమీక్ష సమీక్ష)

నిర్వహణ: 'సాహితీ మిత్రులు'

ఒక రూపాయి.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

(త్రైమాసిక)

6

ఫిబ్రవరి—ఏప్రిల్ 1968

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

ఫిబ్రవరి—ఏప్రిల్ '68 6

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

(త్రైమాసిక)

చర్చావేదిక:

మానవుని మూలభాషలు ఏవి?

దుర్గానంద్

(అయ్యో! ఛీ! ఛిక్! ఓహో! సెభాస్! అక్కటా! ఇవి అసలు మూలభాషలు.
ఒక నీగ్రోవాని భాష ఇప్పుడు అంతర్జాతీయభాష కావాలి.
ఇంగ్లీషు, అరబ్బీ, పారసీలు, మృతసామ్రాజ్యభాషలు, అవి మనకొద్దు. —ఇకచదవండి)

మతవాది మూఢనమ్మకం మన భాష కాగూడదు. యుద్ధోన్మాది క్రౌర్యం మన భాష కాగూడదు. సామ్రాజ్యవాది అహంకారం మనభాష కాగూడదు. మానవుని ఆర్తి రోదనం, ఆక్రందన. మన భాష కావాలి. పతితుడు, బానిస, నీగ్రో, అలాంటివాని భాష మనం నేర్చుకోవాలి. అతనిభాషలో పీడిత మానవుని ఆర్తి ఉంది. అన్ని హృదయాలనూ ఆక్రందితం చేయగలిగిన ధ్వనన శక్తి దానిలోఉంది. ఇంగ్లీషు, అరబ్బీ, ఫారసీలలో అదిలేదు. అవి మృతసామ్రాజ్యభాషలు. మానవుని జీవశక్తిని అవి కోల్పోయినాయి.

భాష మానవుని జీవితేచ్ఛను తెలియజేయాలి. మానవుని జీవితాదర్శం మన కివ్వాలి. అది యింగ్లీషులో ఎక్కడుంది. ఇంగ్లీషు, సంస్కృతం, అరబ్బీ, ఫారసీలు, ఆ యిచ్ఛాశక్తిని ఎప్పుడో కోల్పోయినాయి. అందువల్లే ఆకాలంలో ప్రాకృత పాలీ భాషలు వాటికెదురు తిరిగి వాటిని కాదని ప్రజా జీవితంలో చొచ్చుకుపోయినాయి. దేశీయ జీవితాన్ని ప్రతిధ్వనించినాయి. మనకొక సందేహం కలుగుతుంది. ఉన్నత భాషలను ఇలా తీసివేసుకుంటూపోతే మన ఆఫీసులు, ఫైళ్ళు, రాచకార్యాలు, సైన్సులు విద్యాబోధనలు ఎలానడుస్తాయి. సందేహం సరైనదే. సహజజీవిత ధ్వనిశక్తిని విడ నాడి బాహ్యజీవితానికి కావలసిన భాష పుష్కలంగా నేర్చుకున్న మనం యీ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమే.

యుద్ధం చేసే సమయంలో సిపాయి చేసే సింహగర్జన మనకు భాష కాకుండా పోయింది. అతని కోసం చేసే స్లోగను భాష ముఖ్యమై పోయింది. మనుష్యుని ఆర్తి ఆక్రందన, ఆక్రోశాలను తెలిపే భాషలను మనం నాశనం చేసుకుంటూ పోతున్నాము. వాటిని చాటించడానికని కొన్ని చాటింపు భాషలను తయారు చేసుకున్నాము. ప్రజల కోలాహలాలు కేరింతలు మనకు భాషకావడంలేదు. కంగ్రాచ్యులేషన్లు, కండోలెన్సులు చెప్పేభాషలు, భాషలు అవుతున్నాయి. మనుష్యుని సూటిఅనుభవాలను చెప్పే సూక్తులు మనకు కొరవడి పోతున్నాయి. ఆఫీసులు నడుపుకోవడానికి లాంఛన ప్రాయమైన భాషలూ, మేంటేనెన్సుకు సంబంధించిన భాషలు, రికార్డులు, ఫైళ్ళు, స్టేటుమెంటులు డ్రాఫ్టులు, చెక్కులకు కావలసిన భాషలు విస్తారంగా పెరిగిపోతున్నాయి ఈ చాటింపు భాషలవల్లా ఈ స్లోగను భాషలవల్లా, ఈ డ్రాఫ్టులు చెక్కులు భాషలవల్లా ఈ బాహ్య జీవితపు నీరస భాషల వల్లా మానవుని అంతస్థిత జీవితశక్తిని తెల్పే భాషలు చచ్చిపోతున్నాయి. జీవశక్తి పోయిన తరువాత అక్షరాలు మాసిన బ్లాంక్ పేపరుకు ఎంత విలువ ఉంటుందో అంతే విలువ యీ భాషలకు ఉంటుంది. ఇవిపైకి నీటుగా అందంగా ఉండవచ్చు. పైపై జీవితాలను స్పృశిస్తూ ఇవిసభ్యతగా కనిపించవచ్చు. కాని మనుష్యుని లోపలి జీవితాన్ని స్పృశించి మురికి పడనిదే వీటికి ఏమీ విలువలేదు. సంస్కృతం చదివి పూర్వసంప్రదాయం రసాస్వాదన చేయవచ్చు. ఇంగ్లీషు చదివి ఆఫీసులు నడుపుకోవచ్చు.

నిసర్గ మానవుని దగ్గర ఒక నిసర్గమైన భాష ఉంది. అది చాలా సంక్షిప్తమైన భాష. ఓహో! ధిక్! ఛీ! అయ్యో! ఇవే మానవుని సరైన మూలభాషలు. మనుష్యుడు క్రియా జన్యమైన ఒక అఘాతానికి గురిఅయినప్పుడు అప్రయత్నంగా ఆ క్రియలోనుంచి ఒక నాదంకూడ వెలువడుతుంది. ఒక బండి వేరొక బండిని ఢీకొని చితుకుతున్నప్పుడు వాటి నుండి ఒకసంఘట్టన శబ్దం వినవస్తుంది. మనుష్యుడు ఇంకొకమనుష్యునితోను, ఒకక్రియ ఇంకొక క్రియతోను ఢీ కొన్నప్పుడు కొన్నిధ్వనులు వెలువడుతాయి, అవే ఓహో! ఛీ! ధిక్! అయ్యో! అన్నస్వరాలు. ఇవి మూలభాషలు. ఇప్పుడు మనం మాట్లాడుకునే భాషలు వీటికి వ్యాఖ్యానాలు, వివరణలూనూ. ఈ సృష్టి ఎంత అందంగా ఉంది. ఈ నదులు, కొండలు, సెలయేళ్ళు ఓహో! ఎంత బాగున్నాయి' అని కవులు అన్నారు. వందలాది కావ్యాలు వ్రాశారు. సృష్టిని తిలకించి సంస్తుతించిన సమస్త వర్ణనలూ యీ ఓహో! అన్న భాషకు వ్యాఖ్యానాలు. అలాగే మానవ హృదయంలోని అసహనం 'ఛీ' అన్న శబ్దంనుండి వెల్లువకి ఎన్నో వీరరస కావ్యాలను రౌద్ర భీభత్స భయానక కావ్యాలను

సృష్టించింది. డికెన్సు, గోర్కీ, శరత్తు మొదలైన మహారచయితలు, ఎన్నో లక్షల కన్నీటి అక్షరాలతో 'అయ్యో' అన్న మానవుని మూలుగును అందించ ప్రయత్నించారు. వారినవలలు అన్నీ దానికి వ్యాఖ్యానాలు. ఎన్ని గ్రంథాలు వ్రాసినా ఈ ఆక్రందన స్వరం అందని లోతు పాతుల్లో మానవునికి అంతు చిక్కకుండానే ఉంది. ఈ అగమ్యమైన అతిలోకమైన అభివ్యక్తిని మనం వ్యాకరణాంశాలతో, అలంకారాలతో ఛందస్సుతో కొలుచుకుని తృప్తి పడతాము. ఆఫీసుల ఉపయోగానికి, స్కూళ్ళకు, వేదికల మీదకు ఒక భాషను తెచ్చుకుని అదే దాని నిజస్వరూపమని భ్రమపడతాము. దాన్ని ఇంగ్లీషు అనీ, హిందీ అనీ తెలుగు అనీ పిలుచుకుంటాము. అసలు యీ ఇంగ్లీషు ఏమిటి? తెలుగు ఏమిటి? మనం బజారుల్లో బట్టల దుకాణాల్లో మాట్లాడుకుంటున్న తెలుగు తెలుగేనా అని. అసలు మన తెలుగు ఎక్కడుంది? తెలుగు పిల్లవాని అరుపులో ఉంది. నవ్వులో ఉంది. కేకలో ఉంది. ఇంగ్లీషు భాష, ఇంగ్లీషు స్త్రీల దగ్గరా పురుషుల దగ్గరా పిల్లల దగ్గరా ఉంది. అది చాలా దూరంలో ఇంగ్లండులో ఉంది. మనం మన ఆఫీసుల్లోకి లేబరేటరీల్లోకి ఫైళ్ళలోకి తెచ్చుకున్నది ఆ ఇంగ్లీషు కాదు, ఆ ఆత్మ కాదు. దాని శరీరాన్ని తెచ్చుకొని ఫైళ్ళలో పెట్టాము. దాని డూప్లికేటు ఇది. పుస్తకము అంటే బుక్ అనీ కలము అంటే పెన్ను అనీ ప్రేమ అంటే లవ్ అనీ అలాంటివన్నీ కలిపిన ఒక వాక్యాన్ని తెచ్చుకున్నాము. కాని ఒక ఇంగ్లీషు బాలుడు ఒక ఇంగ్లీషు తల్లివద్ద పాలు తాగుతూ ఏ పారవశ్యంలో ఏ పలుకులు ఉచ్చరించుతాడో ఆ భాష ఏమిటో మనకు తెలుసా! దాన్ని మనం అనువాదం చేయగలమా! ఒక యుద్ధ వీరుడు రణరంగంలో యుద్ధోన్మాదంలో ఏమే సింహగర్జనలు చేస్తాడో మనకు తెలుసా! వాటిని మనం అనువాదం చేయగలమా! చేయలేము. వాటిని కొంతవరకు షేక్స్పియరు మొదలైన కవులు చేశారు. వాటిని ఇంకెందరో చేశారు, ఇలా ఇలా అనువాదం చేసుకుంటూ మనదాక వచ్చిన ఆ ఇంగ్లీషు సారం పోయిన పిప్పి. ఆ పిప్పని గొడ్లకు వేసినట్లు ఆఫీసులకు వేశాం. సంస్కృతమూ నేడు అంతే. అది సరైన జీవశక్తిలో ఉన్నప్పుడు యౌవనంలో ఉన్న దేహంగల మనుష్యుడిలా ఉండేది. ఇప్పుడు యౌవనం పోయింది. శరీరం మాత్రం ఉంది. దాంట్లో మళ్ళీ యౌవనం నింపాలను కోవడం కూడని పని. వ్యవహారంలోకి మళ్ళీ దాన్ని తీసుకవస్తే ఆ శక్తి వస్తుందనుకోవడం కేవలం భ్రమ. ఒకప్పుడు ఒకదానికొక శక్తి ఉండడంవల్ల దానితో కొంతవ్యవహారం నడుస్తుంది. శక్తి నుండి వ్యవహారం వస్తుంది వ్యవహారంనుండి శక్తి రాదు. ఫారెస్టు అనేది ఉంటే ఫారెస్టు ఆఫీసు మొలుస్తుంది. ఆఫీసు ముందు పెట్టుకున్నాం. మనకోసం ఫారెస్టు ఎక్కడ మొలుస్తుంది!

భాషకు జీవశక్తి ప్రజల్లోనుంచి ఆ పరిసరాల్లోనుంచి రావాలి. ప్రజలు భాషకు జీవం ఇస్తారు. భాష ప్రజలకు జీవం ఇస్తుంది. కొంతకాలానికి ఆ భాష పోతుంది. ఆ ప్రజలు పోతారు. భాష ఉందిగదా ఎక్కడకు పోతుంది అనవచ్చు. రంజిత్‌సింగ్ టిప్పుసుల్తాన్, రాణా, వేసుకున్న కవచాలు ఇప్పుడూ ఉన్నాయి, పురాతన ప్రదర్శన శాలల్లో. కాని వాటిని మనం వేసుకోలేము. చూడడానికి పనికి వస్తాయి. ఆ కొలతలు వేరు, ఆ ఉపయోగాలు వేరు, ఆ డిజైన్లు వేరు. భాషలకు కూడా ఆ కాలం ఇచ్చిన డిజైన్లు, కొలతలు ఉంటాయి. ఆ మనుషులూ, ఆ మనస్సులు, వాళ్ళకు వచ్చిన భావోద్రేకాలు దానికి కావలసిన శబ్దాలు, శైలీ నిర్మాణాలు. అవన్నీ విడదీయరాని అంశాలు. ప్రాచీన భాషలన్నీ ఇప్పుడు చూడడానికి ఉన్నాయి. ఇంగ్లీషు ఇప్పుడిప్పుడే అలాంటి దుస్థితిని పొందుతూఉంది. షేక్స్పియరు, బేకను, జాన్‌కీట్సు, షెల్లీలు రూపొందించిన ఇంగ్లీషు ఒకప్పుడు ఉండేది. తరువాత రెండవ తరంలో అది సామ్రాజ్యాలు నిలబెట్టుకునే భాష, క్రమశిక్షణనేర్పే భాష, కోటలు కట్టుకునే భాష, వ్యాపారాలుచేసే భాష అయింది. ఆ తరువాత ఇది అంతార్జాతీయ భాష అనే ఒక విచిత్రమైన పేరుతో సంధి పత్రాలకు, సంతకాలకు, ఒప్పందాలకు, పారిభాషిక శబ్దాలకు పనికివచ్చే దుబాసీల భాష అయింది. తననైజ జీవశక్తులను కోల్పోయింది. ఆర్తమానవ సందేశాన్ని కోల్పోయింది. పునరుత్థాన శక్తిని కోల్పోయింది. ప్రజలకు దూరమైపోయింది. ఇక ప్రపంచం దాన్ని విడనాడుతుంది. బానిస తనానికి సామ్రాజ్యవాదానికి చిహ్నంగా ఉన్న ఈ భాషను ఎంత త్వరగా విడనాడితేగాని అంత త్వరగా మనుష్యుడు, తన సృజన శక్తుల్ని, తన దేశీయ ప్రవృత్తుల్ని తన భావోద్రేకాలకు తగిన అభివ్యక్తుల్ని కూర్చుకోలేడు.

అసలు ఒక దేశంలో ఉన్న భాష మనం ఎంత ప్రయత్నించినా వేరొక దేశంలోకివచ్చి మనలేదు. కాబూలులోఉన్న ఖర్జూరం మనదేశంలో మనలేదు. మన మామిడి చెట్టు అక్కడ పెరగలేదు. పెంచ ప్రయత్నంచేస్తే విశేషపరిస్థితులు కల్పించాలి. అప్పుడు మన దేశంలోనూ ఖర్జూరాలు పండుతాయి కాని ఆ కొద్ది పంట కోసం ఎన్నో ఎకరాల వరి పొలాన్ని ఆహుతి చేయవలసివస్తుంది. ఇప్పుడదే జరిగింది. ఇంగ్లీషు అనే ప్రత్యేక ఫల సాయం కోసం ప్రజల ఎన్నో ఖాద్య పదార్థాలను ఖర్చుపెట్టవలసి వచ్చింది. ఆ ఒక్క మొక్కను పెంచడానికి మన ఎన్నో మొక్కల గాలి, వెలుతురు, నీరు దానికి ధారాదత్తం చేయవలసి వచ్చింది. మన మాతృ అనుభూతులకు అభివ్యక్తులకు కృత్రిమమైన నాలుకను ఇచ్చి రంగు వేసి

విగ్గు బెట్టి వేషం వేసి రంగస్థలం మీద వికృత లాస్యం చేయవలసి వచ్చింది. ఆ వికృతిలో ఒక వినూత్నత వచ్చి ఉంటే ఉండవచ్చు. కాని ఇప్పుడు వికృతి వినూత్నతల ప్రశ్న కాదు. మనం ఇంగ్లీషు పేరుతో ఏ ఇంగ్లీషు నేర్చుకుంటున్నామో అది ఇంగ్లీషేనా అని. నది సహజ పరిధుల్లో సహజవేగంలో ప్రవహించుకుంటూ పోతుంది. అప్పుడు అది నది. ఆ నీరును కాలువలోకి పెట్టుకుంటే కాలువ అవుతుంది. అలాగే ఒక దేశంలోని, ఒక కాలంలోని బాషలను వేరొక కాలంలోగాని వేరొక దేశంలోగాని ప్రవహింప జేసినప్పుడు కాలువలు అవుతాయి.

భాష నిత్య జీవన సంబంధి. అది ఒక జీవితం. అది శబ్దంతోను, రెలితోను, కాలంతోను. అల్లుకొనిపోయి తేనె తుట్టెలా ప్రోగుతుంది. తుట్టె దులిపితే దాని వ్యక్తిత్వం ఉండదు. ఈగలకు యీగలు పోతాయి తేనెకు తేనె పోతుంది. మనకు మైనం మిగులుతుంది. ఒకవేళ దానిని సీసాలకు పట్టి ఉంచినా అది రోగులకు మందుగా ఉపయోగించుతుందే తప్ప పువ్వులలో ఒకప్పుడు మకరందం అనీ దాన్ని తేనెటీగలు మోసుక తెచ్చాయనీ, అది కొమ్మలకు పట్టి ఉన్నప్పుడు ఒక వుంఖావంతో ఉండేదనీ మొదలైన ఏ విశేషాలూ దానికి అంటవు. అప్పుడది దుకాణంలో దొరికే తేనె. దుకాణంలో డబ్బుకు కొనే తేనె, వ్యక్తిత్వంలేని తేనె. రోగులకు ఉపయోగించే తేనె. అలాగే ఇప్పుడు మన దేశంలో ఇంగ్లీషు కూడా. ఆత్మలేని భాషతో అనుభూతిని పొందలేము. కొన్ని అవసరాలు తీర్చుకొనవచ్చు.

★

(సృజన ఫిబ్రవరి 67 సంచికలో ఆరంభించిన 'జీవితానుభవంలో హేతువాద దృష్టి' చర్చను నిలిపివేసి ఈ సంచికనుంచి భాష పై చర్చను ఆరంభిస్తున్నాము. నిజానికి శ్రీ దుర్గానంద్‌గారు ఈ వ్యాసం చర్చావేదిక కొరకు వ్రాయలేదు. కాని ఈ వ్యాసం ఈ నాడు దేశంలో ప్రబలితమంగాఉన్న భాషా విషయక ఆలోచనావేశాలు వ్యక్తమవడానికి తోడ్పడుతుందని దీనితో చర్చను ప్రారంభిస్తున్నాము. ఈ వేదికను ఆలోచకులయిన రచయితలు వినియోగించు కుంటారని ఆశిస్తున్నాము.

— సంపాదకుడు.)

'మనిషి' కథ

కిషన్

'ఎవరు ......ఎవరక్కడ?'—

ఆ గొంతుక ఖంగుమని శంఖారావంలా ధ్వనించింది........

'నేను ......నేను మనిషిని'

జవాబు అణుకువగా ఉంది. స్వరంలో నిజాయితీ—ఆత్మస్థైర్యమూ ఉన్నాయి. మల్లెలు విచ్చుకుంటూన్నట్టు, నక్షత్రాల పుప్పొడి ప్రాగ్దిశా మండపంపై వెల్ల వేస్తున్నట్టు చైతన్య ప్రకాగడాలు ముట్టించినట్టు. లోకాన్ని ప్రభావితంచేసే ప్రాతఃకాలపు కాంతి తాలూకు సవ్వడి ఆ గొంతుకలో ఉంది.

'నిజమా? నిజమేనా?........నీవు నిజంగా మనిషివేనా?' ప్రశ్న వెనక భాగాన రెండు కండ్లు మిలమిలా మెరిశాయి.

మనిషి పలకలేదు — అయోమయంగా ఆ కళ్ళవేపు చూశాడు. అవిరెండూ ఉషఃకాంతుల్లో ప్రభావిత మౌతూన్న రెండు కాసారాల్లాగున్నాయి. క్రమేపీ వాటి ప్రకాశం పెరిగిపోతున్నది.

మీరు నన్ను చూస్తున్నారు—ఐనా నన్నెవరని ప్రశ్నిస్తున్నారు. మీరింతకు ముందు మనిషిని చూసి ఉండలేదా?'

జడుసుకున్న పసివానికి ధైర్యం చెపుతూన్నట్టు నవ్వు విన్పించింది— శాంతి పక్షిరెక్కల్లాఉన్న ఆ కళ్ళల్లో కూడా నవ్వు కన్పించింది. ఆ కనుకొలుకుల్లోంచి జాలి ఏ క్షణాన్నైనా పాల చుక్కల్లా జారి ప్రపంచంమీద జల్లుగా పడనున్నదేమో అనిపించింది మనిషికి ...ఐనా అవి ప్రేమగా నవ్వుతూనే ఉన్నాయి.

'లేదు—కాని నిన్ను పోలిన జంతువులను అనేకం చూశాను. చూస్తున్నాను. సృష్టిలో ఎన్నో రకాల జంతువులను చూశాను. చూస్తున్నాను. ఏనుగు,—కోతి,—పులి ఇవెట్లా ఉంటాయో నీకు తెలుసునా?'

మనిషి విస్మయంలో అవాక్కయ్యాడు. ఇన్ని శతాబ్దాలుగా తన పూర్వీకులు సృష్టిలో తమ మేధను లడాయించి ఆక్రమిస్తూన్న నాగరికతకు వారసుడు తనా?

అంటే ఎన్నోరకాల జంతువుల్లాగే తనూ ఒక మృగప్రాయుడేనా?— ఐనా మనిషికి కోపం రాలేదు.

ఆ స్వరంలో మార్దవం ఉంది. వ్యంగ్యంలేదు. అవహేళనలేదు. దూషణలేదు— ఏదో పోగొట్టుకొన్న వస్తువేదో దొరకనున్నదన్న ఆశఉంది. అందువల్లనే మనిషికి కోపం రాలేదు.

'మీరు పొరబడుతున్నారనడానికి సాహసిస్తున్నాను' తనకు తెలువకుండానే వినమ్రుడౌతూ మనిషి జవాబుగా అన్నాడు. 'నన్ను పోలిఉన్నవాళ్ళంతా నా బంధువులు. నాతోటివాళ్ళు— వాళ్ళంతా జంతువులైతే నేనొక్కణ్ణిమాత్రం మనిషి నెట్లా?'

మనిషికి క్షణం తర్వాత బాల సూర్య ప్రభల్లాగున్న ఆ రెండు కళ్ళు రెప్పలు మూసుకుంటూ కన్పించాయి. రెండు క్షణాలపాటు ప్రకృతి కుత్తుకమీద నిశ్శబ్దం కత్తులు ఆన్చింది. ఆ తర్వాత చను మొనలు కోసేసిన కొండలు పెడ బొబ్బలు పెడుతూన్నట్టు 'నేనొక్కణ్ణి మాత్రం మనిషినెట్లా?—నేనొక్కణ్ణి మాత్రం మనిషినెట్లా?' అంటూ ప్రతిధ్వనులు విన్పించినై —

మనిషి అయోమయంగా చూశాడు చుట్టూ.

కాని ఎక్కడా ఏమీ కన్పించడంలేదు. ఎక్కడా చీకటిలేదు—ఎదురుగా ఉన్నది ఆకాశంకాదు — కాని గోచరమౌతూన్న వస్తువేమిటో పోల్చుకో రావడంలేదు. వెలుతురు లేదనా?— ఎదురుగా శూన్యమా? కాదు. లోకమంతా ఉన్నట్టున్నది?— తను జాగ్రదవస్థలో లేడా? విన్పిస్తున్న ధ్వనులకర్థమేమిటి?—

ఇది మాయా?— ఎక్కడున్నది మాయ?— ఇది మాయా కాదు దైవమూ వగైరా అంతకన్నా కాదు.

తనలో సహజమైన చైతన్యం నశిస్తున్నట్టున్నది— ప్రేరణలేదు— ఉద్రేకంలేదు— పోరాటంచేయమని బుసకొడ్తున్న జీవకణాలుకావు తనవి— ఎవడో మహానాయకుడి కోసం తుపాకులువాల్చి అంత్య నమస్కారాలు చేస్తున్న సైనికుల్లా ఉన్నాయి ఇవి.

కాని ఎట్లా?—

ఎట్లా?—

మనిషి అర్చి గొంతెత్తి అరిచాడు —అది ఆక్రందన కాదు— కార్యోన్ముఖుడు వేసిన బొబ్బకేక—

నువ్వు — నువ్వెక్కడ? నన్ను జంతువుల జాతివాణ్ణిగా జమకట్టి — నా జ్ఞానేంద్రియాల మీద నీ అభిప్రాయాల తెరలు దించాలనుకున్న నీవెక్కడ?—

'ఏం - భయపడుతున్నావా?'

'కాదు—'

'ఉక్రోషమా?'

'నేను కన్పిస్తే—నా మీద పగతీర్చుకుందామనా?'

'నాకు పగల్లేవు—నేను మనిషిని'

'మరెందుకు?'

'నన్ను పోలిన జంతువులనేకం చూశానన్నావ్—ఏరీ? మా వాళ్ళంతా ఏరీ—నేనొక్కణ్ణే ఇక్కడ—'

'ఒద్దు—వాళ్ళంతా జంతువులైపొయ్యారు—వాళ్ళతో నీకేంపని — నీవిక్కడే ఉండు—'

మనిషి నిర్వికారంగా నవ్వి అన్నాడు 'ఒంటరితనం నన్ను మాత్రం మనిషిగా ఉంచుతుందా—'

'వాళ్ళంతా కలిసే ఉన్నారు—మరి వాళ్ళంతా అట్లా ఎందుకయ్యారు?'

'నీకు తెల్సు—'

'ఔను నాకు తెలుసు ...'

'అదేమిటో చెప్పు ...'

జవాబుగా తిరిగి నిశ్శబ్దం. అంతులేని ఆ ప్రదేశమంతట చీమ జారిపడితే విన్పించేటంత నిశ్శబ్దం. క్రమేపీ దూరం నుండి నడచివస్తున్నట్టు వస్తున్న శబ్దాలు.

ఎన్నో వేలమంది భయంగా ఊపిరి పీలుస్తున్నట్టు.

నిద్రాభంగమౌతుంది—కాస్తచప్పుడు తగ్గించి మ్రోగకుంటే ఎముకలగూడు చెదిరిస్తే భయం భయంగా బాదుకుంటూన్నట్టు గుండెలుచేసేలబదిణలు. ఎన్నోవేలు.

నోట్లో గుడ్డలు కుక్కబడిన ఇల్లాలు ప్రసవ వేదన పడుతూన్నట్లు — ఏవో రపరవలు—

సన్నగా—

భయం భయంగా—

నిస్సాహసంగా

రోషంచచ్చి—పౌరుషంచచ్చి .. వివేకం పెదిమలకు దారాలు కట్టి—

కర్తవ్యపు వెలుగు దీపాల మీద అవసరాల అవగుంఠనాలు వేసుకొని—
నక్కి——నీల్గి....

అంతదాకా ఆడిస్తూన్న ప్రహసనంలో మూగవాళ్ళు చెవిటివాళ్ళు ప్రేక్షకులుగా చేరినట్లు ......

ఏదో వేసుళ్ళాడుతూంది ... ఏమిటా సవ్వడి?

మనుషులంతా మూక ఉమ్మడిగా పరుగెత్తి భూమిపుండులో బోర్లాపడిపోయినట్లు ఉండీ ఉడిగీ ఏమిటో పెద్దగా విన్పిస్తున్నాయి.

—ఏమిటా ధ్వనులు?

ఎవడో ఎవతితోనో 'సరస'మాడుతున్నాడు.

'అబ్బ! మోటుగా—' బేరంలో అన్నీ మంచి కూరగాయలే ఏరుకుంటూన్నట్లు—
జవాబుగా నవ్వు—సహజజ్ఞానంలోపించిన దర్పంతో—

....

ఎవడో అమ్ముడు బోతున్నాడు—

'మీ కాళ్ళకింద బతికేటోళ్ళం—రేపు ఏ అక్కరైనా మీతోనే. మిమ్మల్ని కాదని పోతమా?—

'ఇదిగో—ఈ పది ఉంచు—'

'ఎందుకు బాన్సెను—ఒద్దు—'

'ఆఁ—అట్లనకు—మనకిదో లెఖ్ఖ—ఉంచు'

....

ఎవరో ఏడుస్తున్నారు—ఎవరో బెదిరిస్తున్నారు.

'వోడికెల్లి తేవాలి పైకం—'

'నన్నడుగుతే ఎట్లాచెప్ప—

'మిమ్మల్నడుగొద్దాయె—ప్రతిదానికీ ఇంతింత పైకమాయె—ఎట్లమొత్తుకొనేది—ఏడజచ్చేది. కొనబోతె కొరివి—అమ్మబోతె అడివి ...'

'అపు నీ సోది—వానివి జప్తుచేయి—ఎహా కరో—వహా కరో—'

'ఏసేస్—ఇమ్మీడ్యట్'

ఎవడో చెప్పులు మోస్తున్నాడు

....

'.........ప్రజా హృదయాధిపీఠా! యువజన చకోరా.........!............ నీవు చేసిన ప్రజామేలు ఎన్నటికీ మరువలేనిది. నీవు మా ఊరు వేంచేయుట మేం చేసుకొన్న పుణ్యం.'

పగటి దోపిడి జరుగుతూంది.

'కిలో తిండి గింజలు—అయిదు రూపాయలు'

'కిలో గింజలో?—'

'మూడు రూపాయలు—'

'గజం గుడ్డ?'

'మేలురకం పదిరూపాయలు....,

'ఒద్దు— ముతకరకం'

'దొరకదు....కంట్రోల్ క్లాత్ అది'

చేతులు చాటుచేసుకనడుస్తూన్నట్టు ధ్వని....

'ఆకలి—'

....

'కష్టంచేసుకొని కడుపునింపుకోలేవూ?'

'దొరకడం లేదు ..'

'తిరుగుబాటుచేయలేవూ.'

'నేనొక్కణ్ణా'

'ఔను ...వీ వొక్కడివే .. ఎట్లాగుమరి?'

....

ఎక్కడ్నో వరిగడ్డి మంటలు వేసినట్టు ఏవో అరుపులు ... టపటప ధ్వనులు-గోలలు—నిశ్శబ్దం ..

ఎవడో పరిగెడుతూన్న చప్పుడు ...

ఏదో మెత్తని పదార్థం విరిగిపడ్తూన్న ధ్వనులు .. బహుశా సముద్రపుటలలు....

'ఎవరా పరుగెత్తేది ...'

'ఆగు! ఆగు! అది సముద్రం'

'అరెరె ఆత్మహత్య చేసుకుంటావా?'

'ఆగవయ్యా! ఆగు—అబ్బ నీతో నూరుగురు'

'—ఏమిటీ నాతో నూరుగురా?'

'ఔను నూరుగురు—కాని వాళ్ళు నూరుగురే ఐతే .... కాక కేవలం నూరుగురే ఐనా....ఈ ప్రయత్నంవాళ్ళు చేసినందుకు విచారించేవాణ్ని కాదు—కాగా బ్రతికించి నందుకు సంతోషించేవాణ్ణి—కాని వాళ్ళునూరుగురు కాదు—వాళ్ళు లక్షలు—కోట్లు—అందుకే అయోమయంగా ఉంది.'

'ఆదేమిటీ లెఖ్ఖ—'

'నీవెందుకు చావబోతున్నావ్ .'

ఏం చెయ్యను-పంటలులేవు-వసతుల్లేవు.... అన్నీ ఉన్నోరికే – ఉన్నోళ్ళు వేయికొక్కరు. వసూళ్ళ అప్పులు కట్టలేం– వలసొచ్చాం-పనిలేదు. యజమానిలో నిజాయితీ లేదు— సరుకులు నిప్పుకన్నా వేడిగా ఉన్నాయి. చద్దామనుకున్నాను—ఇంకెందుకు బతికేది—?

'ఔనా–నీవలెనే వాళ్ళంతాగూడా–ఎన్నోరకాల మనుషులు–అందరూ అట్లాగే కష్టాలు సహించలేక జీవితంమీద రుచిచచ్చి చచ్చిపోదామని వచ్చారు — నీ వంటి రైతులు లక్షలు–ఆయన వంటి ఉద్యోగస్తులు లక్షలు–ఆ కూలీలు లక్షలు–అందరికీ ఒకే బాధ–ఆకలి–గుడ్డ గూడు—'

మళ్ళీ నిశ్శబ్దం—ఏదో అంతవరకు బుసగొడుతున్న జంతువు కంఠ నాళం తెగిపోయినట్లు.

దీర్ఘాలోచనా నిమగ్నుడైన మనిషిముందు విస్ఫులింగాల్లా మెరుస్తున్న రెండు కళ్ళు! అవినవ్వుతున్నాయ్.

మనిషికోలుకున్నాడు.

ఎదురుగా ఆ కళ్ళు!

'ఇప్పుడు నీవు విన్న సవ్వడి ఏమిటి?—

'వాళ్ళందరూ నా వాళ్ళు .. నా మనుష్యులు'

'ఇంకా మనుష్యులుగానే భ్రమపడుతున్నావా,? కాదు జంతువులు. జంతువులు కూడాకాదు. అవి ఎన్నో విషయాల్లో మెరుగు ....'

'నిజం—' మనిషి ఒప్పుకున్నాడు'

'పండిస్తున్నారు కాని తినడంలేదు. నేస్తున్నారు . ... కాని కట్టడంలేదు. ఇళ్ళుకడుతున్నారుకాని మేనువాల్చడంలేదు. ప్రేవులు ఆకలి ఆకలి అంటూంటే నోరు లేనిపశువులా ఈడ్చుకపోతున్నారే శరీర భారాన్ని తప్ప–ఈ జీవితాన్ని ఎంతో మెరుగ్గా

బతికించే చైతన్యం జోలికి పోవడంలేదు. వాళ్ళంతా ఆత్మవంచితులు. తమనితాము–వంచనచేసుకొని జీవిస్తున్నారు ... ఆకలి ... వేదన ... వంచన ఈ లక్షణాలు మనం వేరే మృగాల్లో చూడంకదూ ...'

"ఆపు" మనిషి గొంతును గుహచేసి అరిచాడు.

ఆ అరుపులో కసిలేదు–క్రోధంలేదు. సుళ్ళుతిరుగుతూన్నవ్యథ ఉంది. ఈనాటి వరకూ భూమ్మీది ఏదురంతాన్ని విన్నవాడు గూడా పెట్టనికేక అది.

తర్వాత నెమ్మదిగా అన్నాడు 'వాళ్ళందరూ ఎందుకిట్లా చేవచచ్చి జీవిస్తున్నారు. కేవలం యాంత్రికంగా .. పోరాటంలేదు. తిరుగుబాటులేదు .... కోరికల్లేవు .... ఐతే మరి.... ఐతే మరి ఇంకెందుకు జీవిస్తున్నట్టు... మరి చస్తే ...అట్లాఅర్థం లేకుండా— ఎక్కడా ఈ లోపం?

"అందుకే నీవు మనిషి వన్నాను ....నీలో ఆలోచన ఉంది. నీకు ప్రాణం మాత్రమేకాదు–నీలో జీవం ఉంది—కాని . నీ కర్తవ్యం మాత్రం....ఎంతో కఠిన మైంది. ఎంతో ప్రయాసతో కూడుకుని ఉంటుంది... మనిషి ముఖంలోని కండరాలు సమర్థతతో బిగుసుకుపోయాయి.

సంద్రంలో జారిపోయిన నల్ల పూసను వెతికి తీసినట్లు—

విరిగి తునకలైన వెలుతురు కిరణాల్ని అతుకుతున్నట్టు....

నరనరాల్లోకి కవోష్ణ రక్తానికి బదులు ఏకులుకూరుకుపోయినపైన నిస్సారుల్లోకి ఉడుకు నెత్తురునెక్కిస్తూ ....

తరతరాలుగా కురుస్తూ పేరుకుపోతున్న ఈ మౌఢ్యపు బురదలోంచి నీళ్ళని పైకిలాగి....

"ఔనౌను" మనిషి ఖుషీగా గెంతాడు.

కంచు విగ్రహంలా కాకలు తీరసాగాడు.

క్రమేపీ పరిసరాల్లో మార్పురాసాగింది. అయోమయస్థితి తొలిగి, దట్టంగా పారుతున్న పొగలమధ్యనుంచి ఎర్రని నిప్పుపూలు తొంగిచూస్తున్నట్టు ... శతాబ్దాల వంధ్యత్వం పిదప ప్రకృతి పుష్పవతి ఐనట్టు .... క్రమేపీ జగత్తు ముఖంలో జీవకళ త్రొక్కిసలాడింది.

" సంద్రంలో ...."

మనిషి, పోగొట్టుకొన్న తనతోటివారి హృదయాల్ని వెదికి సమకూరుస్తున్నాడు.

మతమనీ . కులమనీ . నలుపనీ ... తెలుపనీ .... ఎక్కడి కక్కడికి తెగి— చీలి — కూటాలై — గుంపులై — అరటి బోదెలోని పాయల్లా అసంఖ్యాకంగా విభజించబడిఉన్న మానవ సమూహాల్ని ప్రేరేపించి జీవన చైతన్యాన్ని ప్రబోధించి ఎంటులా పేనుకున్నాడు.

....

శతాబ్దాల దాసత్వంతో చచ్చి నిస్సారమైన జీవాణువుల్ని తొలగించి కొత్త ప్రోటజోవాలనెక్కించి— బ్రతుకు సాహసమనీ — బ్రతుకు శీలమనీ — బ్రతుకే చైతన్యమని బలం మందు తాగిస్తున్నాడు.

....

శతాబ్దాలుగా స్వార్థులు అల్లిన మూఢనమ్మకాల సాలె గూడుల్లో చిక్కుకు పోయిన సోదరుల సంకెళ్ళు త్రెంచి వారిచెవుల్లో జీవన వేదం పఠిస్తున్నాడు.

అందుకే ఆ వెలుతురూ చీకటీ కాని మాయ—అందుకే ఆ బ్రతుకూ చావూ కాని రౌరవాలు—విడిపోతున్నాయి.

కొత్త కంఠాలు సవరించుకుంటున్నాయి.

కొత్త ప్రాణాలు సిద్ధపడుతున్నాయి.

అదుగో! అక్కడ తూర్పున ఎఱ్ఱగా సూర్యుడుదయిస్తున్నాడు. ఇక ఈ నవ జనతావాహిని ఆగదు – స్వార్థసర్పంకాటువేసి నాలుకరుచులు తప్పిన తిరోగమన వాదుల్లారా—! ఇక మీపని సరి!

మనిషి జంతువుకాడు—మనిషి మానవుడు!

★

మీరీ సంచిక చదువుతూ ఉండగానే
ఉగాది వస్తుంది.
మీ అందరికీ నూతన సంవత్సర
సృజనాత్మక శుభాకాంక్షలు.

దిక్‌లు మూడు:

కంపు

ముక్కులు పగల గొడుతున్న
దుర్గంధ రక్తస్రావంలో దూకి కేరింతలమునకలేస్తూ
దుర్గంధ రక్తస్రావాన్నే దోసిళ్ళతో తాగుతున్న
మనుషులనే మందల్ని చూశా

నాలుకలు చిప్పుతూ
బ్రతుకును మురగబెడుతూ
సస్యశ్యామలాల్నీ మానవత్వపు పరిమళాల్నీ
ముంచేస్తున్న యీ ప్రవాహం ఎక్కడనుండోనని
పుండు ఎక్కడోనని కత్తుల్తో ప్రయాణించేశా

ప్రపంచం ముట్టయింది
రాజకీయాలు రక్తస్రావం.

—నగ్నముని

★

మనిషి మరణశయ్య పై నుండి....

ఎండిన మబ్బుల పగిలిన పెదాలకింద
రాలిన ఆకుల చెట్ల ప్రేతచ్ఛాయల నడుమ
నా నీడ నాకే అసహ్యమై
భారమై—దుర్భరమై
ఈ వొంకర—టింకర గీతలు గీసే

దుర్గతి తప్ప
ఈ మనిషికి సహాయపడే
సహజీవనం నాకెక్కడ?
ఇంట్లోనే కాందిశీకుడిగా
జీవించే ఈ సమర్థుడి గుండెలో
ఉబికి నిలిచే అసమర్థపు కన్నీళ్లు.
కర్మభూమిలో కర్మతో వోడిపోయినవాడు.

ప్రకృతిమాత ఎండిన రొమ్ములు
పరాన్న భుక్కులు చేస్తున్న మోసపు చేష్టలు
ఈ దిక్కుమాలిన దిక్కులమధ్య
ఆకాశంవేపు చాచిన చేతుల జర్జరత్వం
సాయుధ రక్షణలో దాగిన కొందరి ఐశ్వరత్వం

నగరంలో నర్తిస్తున్న జీవితం
లోకసభ-శాసన సభల్లో వేడెక్కుతున్నగాలి
క్షేమం పడిలో కట్టుకొన్న శీతలీకరణపు గదులు
సంవత్సరాల ప్రభుత్వ చాకిరికి
ఫలితంగా నిరుద్యోగం చూపే
మంత్రుల పాశవిక ప్రవృత్తి
జానపొట్టగాళ్ళకు
ద్రాక్షరసం ఇచ్చేలక్షల సబ్సిడీల
అపహాస్యపు పథకాలు.
పౌరుల హక్కులు అలంకరించిన అధికారంలో
పీకల్ని కోస్తున్న నాయకుల్ని చూస్తున్న
నిస్సహాయ నపుంసక ప్రజాస్వామ్యం.

II

నాలోని అణువుల్ని పంచుకొన్న మానవుణ్ణి
వియత్నాంలో
రోజూ మేకులు దిగకొడచి

లక్షలాది క్రీస్తులకు—బుద్ధులకు
మరణబోధ చేస్తున్న అధికార దాహం
అంపశయ్యపై నీటికోసం
నాలుక చాచిన వాస్తవం
ఇప్పుడుమరణ శయ్యపై నుండి
రక్తం కోరుతున్నది.... (?)
నాయకులనుండి
ప్రజలనుండి
ఒక మహత్తరమైన మార్పుకోసం.

—నిఖిలేశ్వర్

★

మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ మృత్యువుని కాస్తకాస్తగా కొరుక్కుతిన్నాను

రెండోసారి పిచ్చెత్తి
అర్థరాత్రి విజిళ్ళూదాను గొలుసుల్లాగాను. ఎర్రజెండాలూపాను
పుర్రెనీ రెండెముకల్నీ పట్టుకొని చౌరస్తాల్లో నిలబడ్డాను.
రెండు కోతుల్ని బుజానెక్కించుకుని బజార్లంట తిరిగాను.
చిలక జోస్యాలు చెప్పాను రామజోగి మందుల్ని సుజనులకు పంచాను
పేవ్‌మెంట్ల మీద గారడీలు చేశాను.

నిజమే
రెండోసారి పిచ్చెత్తి
కార్చిచ్చులో పిచ్చికుక్కలా కనిపించిన ప్రతివాణ్ణీ కారుకూతలు కూశాను
రోడ్లు రోడ్లన్నీ తిరగేసి
రోడ్ల ప్రక్కన నాగరికత రాసిన ఫుట్‌పాత్‌లకి ఫుట్‌నోట్సు రాశాను
చెత్తకుండీల్లో మురుగ్గుంటల్లో రీసెర్చి చేశాను

దేవళాల మీద డాక్ బంగళాల మీద చర్చీలమీద క్లబ్బులమీద
మసీదుఃమీద లాడ్జింగులమీద బూతు బొమ్మలు గీశాను
సినిమా చూశ్శేక థియేటర్లో తెరకడ్డంగా నిలబడ్డాను
పక్షుల జంతువుల మృగాల బొమ్మల్తో నిండిన ఈ
ఒకటో తరగతి వాచకాన్ని చించి గాల్లోకి విసిరేశాను

మల్లెపూల మీద మందహాసాల మీద వాంతి చేసుకున్నాను
రాజకీయాల్లో, ధర్మశాస్త్రాల్లో వీర్యస్ఖలనం చేసుకున్నాను
వెన్నెల మీద ఉమ్మేసి చంద్రుణ్ణీ నక్షత్రాల్నీ గ్రహాల్నీ రాళ్ళతో కొట్టాను.
భూగోళాన్ని శిశ్న శిఖరాగ్రం మీద నిలబెట్టాను

చెట్లగుబురుల్లో గూబలా తీతువులా కీచురాయిలా గీపెట్టి భయపెట్టింది నేనే
పాతాళవాణిలో భూతాలు పాడిన గీతాల్ని ప్రసారం చేసింది నేనే
భగభగ మంటల్తో నగరం తగలబడి పోతున్నట్లు
నిర్వికల్ప సమాధిలో దర్శించి నిర్భరానందంలో తాండవం చేసింది నేనే

ఏదో వుందని
ఏమో అవుతుందని
కుళ్ళిన శవాలమీద గోరీలమీద దుర్గంధ వీధుల్లో నడిచి నడిచి
రాత్రి రాత్రంతా బీటు పోలీసులా పహరా కాసి కాసి
జాగారం చేసి చేసి అలసిపోయాను

చీలికలు పేలికలై నా మీద వ్రేలాడుతున్న చింపిరి జీవితం మురికి బొంతను
శిలువకు తగిలించి
ఇక్కడే
ఈ చౌరస్తాలో సిగరెట్లు అంపశయ్యపై
ఆకలిని ఆవిష్కరించాను
సారా సముద్రాలు ఇంకిన కళ్ళతో
మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ మృత్యువుని కాస్త కాస్తగా కొరుక్కు తిన్నాను.

—మహాస్వప్న.

కథ

పాలెగాడు

—భైరవయ్య

రామానాయుడు బెజవాడ గుడిసెల్లా భగ్గుమని మండుతున్నాడు. తలుచుకుంటున్న కొద్దీ రెంటచింతలో ఎండలా — నడి వేసవిలో ఇసుక పర్రమీద సూర్యుడిలా మండుతున్నాడు. ఆలోచిస్తున్నకొద్దీ మంటలు భగ్గు భగ్గుమని గుండెల్లో. అతనిలో సహనం నశించి పోతోంది రాయలసీమ బావుల్లో నీళ్ళ లాగ.

'ఛ ఛ ముచ్చటపడి కులగౌరవానికి దీటుగా పెంచుకున్న మీసకట్టుకే అపమానం — ఈ సంగతి ముసలినాయుడికి తెలిస్తే—గొరిగెయ్యరా బోడిమీసకట్టు— అంటాడు. అయినవాళ్ళు— నాయుడి మీసంమీద నిమ్మకాయలు కాదు గురివెంద గింజకూడా నిలవదంటారు—ఛీ వెధవబతుకు. ఊరు ఊరంతటినీ—జిల్లా జిల్లనంతటినీ చూపుతో నిలబెట్టగలనాయుడు—రాజకీయ పార్టీల బ్రతుకుల్తో చెలగాటాలాడగల నాయుడు — చేతకాక, చేతులకి గాజులు తొడుక్కున్నట్టు (సీమంతం పెళ్ళికూతురిలా) కూర్చోడమా—ఛస్....

నాయుడికి ఒంటిమీద జెర్రిగొడ్లు—జలగలు నత్తగుల్లలు పాకుతున్నట్లయింది.

'అయినా ఏంజూసుకునంట—వాడు, నిన్నగాక మొన్న మీసం పెంచటం మొదలెట్టినవాడు—వారం రోజులి క్రితమే తన కొనగంటి చూపుల కరుణతో పంచాయతీ మెంబరైనవాడు—ఖద్దరు పంచె, జరీ అంచు కనపడేలా బిళ్ళగోచీతో పంచె కట్టడం తన దగ్గర నేర్చినవాడు—పెళ్ళైన నెల్లాళ్ళకే చచ్చిన (ఈడే చంపాడేమో), మావగారి నూటయాభై ఎకరాలు హక్కుభుక్తం చేసుకున్నవాడు—పెళ్ళాం సొమ్ముతిని బతకనేర్చినవాడు—వాడు—ఆ బసిరెడ్డిగాడు తను బంగారు తలాటం వేయించిన చేతికర్ర పట్టుకుని ఇద్దరు పొరుగూరు పెద్దరైతులతో పొలం గట్టుని నడుస్తుంటేచూసి, పలకరించకుండా—నోట్లో బీడీ తియ్యకుండా — కిసుక్కున నవ్వి వెళ్ళిపోతాడా, ఏంజూసుకునంట ఆ పైత్యం. అదిపోనీ—మొన్న పడమటేపు పొలంలో కుప్పనూర్చిన

ధాన్యం బళ్ళమీద తీసుకొస్తుంటే వాడి పొలంలో కుప్పనూరుస్తున్నారని చెప్పి బళ్ళని రానివ్వకుండా అడ్డునిలిచి ఇంకా కుప్పనూరుస్తున్న తనపొలంలోకి బళ్ళని మళ్ళిస్తాడా. ఎంతకావరం.

తను వాడిని ఎన్నిమాట్లు కాపాడలేదు.

ఓసారి సందెవేళ పూజారి కోడలు చెరువుకు నీళ్ళకొస్తే చాటునించొచ్చి చెయ్యట్టుకుంటే—ఆడకూతురు లబోదిబోమంటే—నలుగురూ చేరి మక్కెలిరగదన్ని—పంచాయతీ జరపమంటే—వాళ్ళనోళ్ళు మూయించెందవరు. తనేగా.

ఓ మాపటేళ పొలంనించి తిరిగొస్తున్న మాల పడుచుని వాటేసుకుంటే మాలోళ్ళంతా కర్రలుచ్చుకుని వెంట పడితే వాళ్ళనాపిందెవరు. కర్రెత్తిన మాలోణ్ణి మట్టిలో కలిపేస్తానని గర్జించిందెవరూ తనేగా.

వాడికా విశ్వాసం ఏమాత్రమైనా—హుఁ—నీచపు నాయాళ్ళని జేరనియ్యద్దురా అని ముసలి నాయుడు చెప్తే విన్నాడా తను. ఛ—ఛ—వాణ్ణేం జెయ్యాలి. పబ్లిగ్గా ఏం జెయ్యడానికి వీల్లేదు. నిన్నమొన్నటిదాకా వాణ్ణిపొగిడి మెంబెర్ని చేసి ఇప్పుడు తనే వాణ్నేదన్నా చేస్తే తనమాటకి విలువేముంటుంది. అలా అనీ వాణ్నొదిలేస్తే అచ్చోసిన ఆంబోతవుతాడు. నాయుణ్ణి అవమానించినోడు—వాణ్ణి అలాచూస్తూ ఊరుకోడమా—ఊరుకుంటే నలుగురూ వీపెనకాల నవ్వుతారు. ఇవ్వాళీడవుతే రేపింకోడు అందరికీ అదే పరవవుతుంది. లాభంలేదు. విషపుమొక్కని మొదట్లోనే తుంచెయ్యాలి.

నాయుడు బుర్ర సర్కసులో జెయింట్ వీలులా తిరుగుతోంది. కళ్ళు రాకెట్లలా పొగలు మంటలు కక్కుతున్నాయి.

పొద్దుట కాఫీతాగి చుట్ట ముట్టించిననాయుడు మధ్యాన్నందాకా ఆలోచిస్తూనే వున్నాడు. భోజనానికి పిలవ్వొచ్చిన పెళ్ళాం మీద విసుక్కుంటూనే భోంచేశాడు. భోంచేస్తూ ఆలోచిస్తూనేవున్నాడు. భోంచేసాకా మళ్ళీ చుట్టముట్టించి ఆలోచిస్తూనే వున్నాడు. బెండకాయలు ముక్కలుగాకోసి నీళ్ళతో కడుగుతుంటే చేతులకంటుకుని జిగురొదలకుండా పట్టుకున్నట్టు ఆలోచన్లు తెగటంలేదు.

'ఏం చెయ్యడం' అన్నసమస్య—ప్రపంచానికి వియత్నాం సమస్యలా—వంద రూపాయల గుమాస్తాకి ఏడాదికో ఆడపిల్లలా—పెరిగిపోతోంది. పెద్దదవుతోంది. పరిష్కార మార్గం కనిపించటంలేదు.

ఇంతలో వచ్చాడు రంగయ్య. మూడు సీసాల నాటుసారా త్రాగింతర్వాత సీలువిప్పదియ్యని విదేశపు విస్కీ సీసాచూసినప్పుడు ఆనందంతో ఎరుపెక్కిన కళ్ళలా అయ్యాడు నాయుడు. ఆప్యాయంగా రంగయ్యని పిలిచి స్వయంగా చుట్ట కట్టిచ్చి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు.

నాయుడు కుంభకర్ణుడిలా–కింకాంగ్‌లా వుంటాడు. నాయుడ్ని చూస్తే ప్రజలు భయపడుతారు.

రంగయ్య సన్నగా చచ్చుపీనుగులా వుంటాడు. రంగయ్యని చూస్తే ప్రజలు రపీమని ప్రాణాలు పడిచేసారు.

రంగయ్య నాయుడు నమ్మినబంటు. నమ్ముకున్న బంటు.

రంగయ్యకి తన సమస్యవివరించాడు నాయుడు. వాణ్ణి–ఆ బసిరెడ్డిగాణ్ణి నిలువునా పాతెయ్యాలన్నాడు. పూర్వకాలం కాకపోయింది కాని లేకపోతే నూరడుగుల గొయ్యి తవ్వించి, ఒంటి మీద చర్మం బుల్‌బులాగ్గా ఒలిపించి, కారంపూసి ఉప్పులో ఊరేయించే వాణ్ణన్నాడు. వాడిపొడ తనగిట్టదన్నాడు. ఈ అవమానం తనుభరించ లేనన్నాడు.

రంగయ్య తాపీగా విన్నాడు. లక్ష ఏటంబాంబులు తయారు చేసుకకూర్చున్న పెద్ద దేశానికి 'మీ పెరట్లో' వేపాకు గాలికి మా పెరట్లో వాలిందని కొట్టుకుంటున్న రెండు చిన్న దేశాలు దొరికినట్టయింది రంగయ్యకి.

నాయుడు ఆత్రంగా చూస్తున్నాడు. గంజి గుంట దగ్గర కుక్కలాచూస్తున్నాడు.

అప్పుపేరిట భిక్షకోసం వచ్చిన చిన్న దేశాన్ని, పెద్ద దేశం చూసినట్టుగా చూశాడు రంగయ్య నాయుడ్ని. చుట్ట పొగగుక్కపట్టి వదిలి కళ్ళుమూసుకున్నాడు.

'నాయుడుగోరో' అన్నాడు రంగయ్య.

మీసం సరిజేసుకున్నాడు నాయుడు.

'ఆ బసిరెడ్డిగాణ్ణి సంపెయ్యటం ఏమంత కట్టంకాదు గాని–ఆణ్ణి సంపేత్తే మనకేటినాబం' అన్నాడు.

నయా పైసల్లో మాట్లాడుతాడు రంగయ్య.

'వాడవమానం జేసేడు. నాయుణ్ణి నన్నవమానం జేసేడు.

'అదిరైటే నాయుడుగోరో. కాని అడుసత్తే నాబంలేదు.

'ఎందుకంట'

'ఆరునెల్లలో పెద్దెలెచ్చన్లు గదంటండీ—అడుసత్తే రెడ్లేపు ఓటెవడిత్తాడు.

'ఏం ఎందుకియ్యరు, మన్నికాదనే ఓడెవడు.'

'ఆడనేవుంది తిరకాసు. కోపండెచ్చుకోకండి గానీ ఈ మద్దెనాడు మంచి పరపతి సంపాయించేడు గదంటండీ. అణ్ణీప్పుడప్పుడే తీసేస్తే ఎట్టా'

'తీసెయ్యకపోతే ఎట్టా'

'అదే గదండి మరీ. సెంద్రరెడ్డికూ్కడ మంచి పరపతేవుంది గానీ ఆరంత గాదండి. ఎలచ్చన్లయ్యేదాకా బసిరెడ్డిని దువ్వి—ఈ లోపల సెంద్రరెడ్డిని పైకిదియ్యండి. ఎలచ్చన్లవంగానే బసిరెడ్డిని తుడిసేద్దారి.'

'అందాకా వూరుకుంటే ఎట్టా. ఈ లోపునాడికి కావ్వేక్కిపోదో. అంతవరకూ వూరికే కూసోమన్నావా.'

నాయుడు హుంకరించాడు.

'ఊరికే కూసోడమెందుకండీ. ఈ లోపునేనోట సేద్దారి.'

'అదేగద నేనడిగేది'

రంగయ్య మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

నాయుడు మళ్ళీ ఆత్రంగా చూస్తున్నాడు.

"నాయుడుగోరో ఎల్లుండాదోరంనాడు బసిరెడ్డి తూర్పేపు కుప్పనూర్చిన ధాన్యం బళ్ళకెత్తుతారు గదంటండే."

'అయితే'

'అదేంది నాయుడుగోరో బళ్ళమీది ధాన్యం బళ్ళలోనే మాయంజేస్తే సరిగంద'

'అంటే దొంగతనమా'

నాయుడిలో అన్నిగుణాలూ వున్నాయి. కాని దొంగతనం మటుకులేదు. గురివింద గింజికి నలుపులాగ.

రంగయ్య బ్రష్ మీసాల్లో నవ్వుకున్నాడు. ఎమ్. ఏ. మాథమెటిక్స్‌లో యూనివర్సిటీ కంతటికీ ఫస్టుగా పాసయిన కొత్త లెక్చరరు అర్థమెటిక్ ప్రోగ్రెషన్ అర్థంకాని పి. యు. సి. కుర్రాళ్ళని చూసినట్టుగా నాయుడ్ని చూసాడు రంగయ్య.

'కాదు నాయుడిగోరో సెప్పేదినండి మరి. ఆ బళ్ళ మొగిలిపుంతమ్మ ఉగదండి బండొచ్చేది. ఒడుపుసూసి తగలెడితేసరి.'

'మరి ...'

నాయుడ్ని మధ్యలో ఆపి 'యెంకట రత్తానికి బసిరెడ్డికి సెడింది గదండీ. ఇదా యెంకట రత్తంమీద తోసేద్దారి.'

టో మేటాల్లా ఎర్రగావున్న నాయుడు కళ్ళు ఫక్కుమని పగిలాయి.

రంగయ్య బుజంమీద హాయిగా చరిచాడు నాయుడు. జీతగాడ్ని పిలిచి ఇంట్లోంచి స్పెషలు పొగాకు తనకన్నా హోదాలో పెద్దాళ్ళు మంత్రులు వచ్చినప్పుడు ఇచ్చేది తెప్పించి చుట్టకట్టి రంగయ్యకిచ్చేడు. రంగయ్య యధాలాపంగా అందుకున్నాడు అదేదో తన జన్మహక్కన్నట్టు.

నాయుడికి సంతోషంగా వుంది. ఒంట్లో శక్తిలేని గజ్జికుక్కకి ఎముకముక్క దొరికినట్టుగావుంది.

ఆదివారం ఎప్పడెప్పుడా అని ఎదురుచూస్తున్నాడు నాయుడు. పెళ్ళి భోజనానికి వచ్చినవాళ్ళు ఎప్పుడులేస్తారా ఎప్పుడెంగిలాకులు పారేస్తారా అని చెత్తకుండీదగ్గర కూర్చున్న కుక్కలా ఎదురుచూస్తున్నాడు.

ఆదివారం వచ్చింది.

నాయుడు హుషారుగా వున్నాడు. శోభనం పెళ్ళికొడుకులా వున్నాడు.

రంగయ్య సలహామీద ఆదివారంనాడు సాయంకాలం బసిరెడ్డిని ఆహ్వానించాడు.

అంత శత్రువులైన రెండు అగ్రరాజ్యాల కలయికలావుంది. విదేశీ సరుకుసీలు తీసాడు నాయుడు. గ్లాసులు గలగల మన్నాయి. నాయుడు ఖళ్ళ ఖళ్ళుమని నవ్వుతూ మాట్లాడుతున్నాడు. బసిరెడ్డిని మినిష్టర్ని చేస్తానన్నాడు. పైకెక్కించేస్తానన్నాడు. పెద్దోడి వయ్యాక నన్ను మర్చిపోకు రెడ్డీ' అని జోకేసాడు. ఘొల్లుమని నవ్వాడు. బసిరెడ్డినవ్వాడు. స్కూలు జీతం కట్టమనిచ్చిన డబ్బు తీసుకుని తన దగ్గరకు వచ్చిన కుర్రోణ్ని చూసి అనుభవంనించిన బోగంది నవ్వినట్టుగా నవ్వాడు.

నాయుడు కళ్ళు సంతోషంతో మండుతున్నాయి.

దూరంగా మంటలు. కేకలు.

నాయుడు గుండె ఆనందంతో స్పీడెక్కింది. రంగయ్యకేసిచూసి నవ్వాడు. రంగయ్య ఫకాలుమని నవ్వాడు. బసిరెడ్డి పెదాలమీదకూడా నవ్వున్నట్టుంది.

దూరంగా ఎవడో పరుగునొస్తున్నాడు. వాడొచ్చేసాడు. వస్తూనే 'నాయుడుగోరో' అని కేకపెట్టాడు.

నాయుడిగుండె ......

'ఏంట్రా' అన్నాడు.

నాయుడుగోరో సినబాబుగారి తల పగిలి పోనాదండి. కుప్పేసిన పంట తగలెట్టేసారండి. అని ఒగిర్చాడు.

పాపం నాయుడు .... గుండెకాయ .... రంగయ్యకేసి చూసాడు. తనిచ్చిన ఆయుధాలతో తనరాజ్యాన్నే విధ్వంసంచేసిన చిన్న రాజ్యాన్ని. అగ్రరాజ్యం చూసినట్టుగా జూసాడు.

రంగయ్య పెళ్ళున నవ్వాడు. గాలివానకి ఎండిన చింతచెట్టు విరిగి పడ్డట్టుగా నవ్వాడు. వొడి తిరగని మీసం వొడేసాడు బసిరెడ్డి.

'చచ్చి ఏలోకాన్నుందో–నా ఆడదానికిచ్చినమాట నిలబెట్టుకున్నాను నాయుడూ.'

రంగయ్యన్న మాటలు గుండాగిపోయిన నాయుడు విన్నాడోలేదో.

★

వేచి చూడండి

కాళోజి

ఎన్నాళ్ళ నుంచో అనుకుంటున్నాను.
చివరి గేయం ఒకటి
అన్నింటికన్నా మంచిది
రాసి పారేద్దామని
రచన ఆపేద్దామని

(ఏది రాసినా చివరకు చూసుకుంటే తెలుస్తుంది
మొదటి గేయంకన్నా అధ్వాన్నంగా ఉందని
అందుకే రాసేస్తున్నాను నిలుపక
ఆనాటినుంచి ఈనాటివరకూ)

ఒకసారి నేను ఇంద్రుణ్ణి
ఈ ప్రకృతి ఇంద్రాణి
పోరాడి పోరాడి అలసిన నా ఇంద్రియ గణం
ఇంద్రగణం మూల్గుల్నికూడా బిరికిపెట్టింది.

ఒకసారి ఈ గుండె
స్వర్గాల నిర్మించుకుంది, మురిసింది.
నరకాల నిలద్రొక్కి నిలచింది, నవ్వింది.

ఇంకా ఈ జీవనంలో
ఎన్ని దరుబరాపిళ్ళు!
ఎన్ని పదును తాపిళ్ళు!
ఎన్ని పల్చాల జారుళ్లు!

ఎన్ని మిట్టల ఆపుళ్లు, ఎగిసిపోతలు.!
ఎన్నెన్నిమళ్ళు, పరుగుళ్ళు!!
సాగిన ఈ జీవనవాహినితోపాటు
సాగిస్తున్నాను రచన

ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్న రచన
ఎప్పుడో రాసి పారేస్తాను.
చివరి గేయం అన్నిటికన్న మిన్నగారాసి
రచన ఆపేస్తాను.

(ఈ అంచనా నా రచనల వరకే సుమండీ
మీ రచనలతో వాటిని ఎన్నడూ పోల్చుకోలేదు నేను
అట్లా చేస్తే రెండువిధాలా చిక్కే.
మీ రచనే బాగున్నదనిపిస్తే నేనేమొగం పెట్టుకుని వ్రాయను?
నా రచనే బాగుంటే ఇంకేం
ఆ మురిపెం మళ్ళీ కలంపట్టనిస్తుందా!)

ఎప్పుడు? అని అడగకండి
వేచి చూడండి!

★

ఆఖరు ప్రస్తావన

సి. వి. కృష్ణారావు

అమ్మా
పొత్తి కడుపున చిరుచిరుగుకప్పి ఉష్ణశీతలాల
ఉనికిని నేర్పితివే
దినదిన సంఘటనలో మనమున్నది
ప్రతిదీ మనదని మాత్రం చెప్పకపోతివి.

తొడిగిన చొక్కా నిండా తమాషాల వన్నెలు కుట్టించి
అడుగడుగునా కొత్తది నేర్పి
                                        సంకటాలు కల్పించి
మారాంచేసిన మాలిమిలో మరపించు మణులిచ్చి
రేపన్న రుజలో భారం ఏనాడూ చెప్పకపోతివి.
రాజిచ్చే రత్నకిరీటం రజోగుణాన్ని పెంపొందించెను.
పయసిచ్చిన వజ్రకిరీటం ఒక జవరాలికి
                                        లాలిపాట పాడెను.

వెండి పాలవెల్లి చేయించి ఒక మూలన కూర్చుండబెట్టి
ఎందరినో కాపలావుంచి అందరిమధ్యన అటమటింపజేసి.
ప్రతి అంగం బలహీనమై నా తత్వం మృత్తికమై
చేవచెడి బలుపు విరిగి
బహు స్వల్పమైనదానికిగూడ బానిసనై పోతిని—

అమ్మా
నీ పోషణ అమృత తుల్యమ్మని
చలికీ వేడిమికీ చాల గిలిగిన శక్తి కలశమని
రుచికీ రూపసికీ లొంగని ప్రబోధమని
సామాన్యుల సంకెళ్ళకు సంకట పడనీయని శాశ్వతమని
నన్నుసుకొననీయక పోతివి.

నీ తర్జని నిర్దేశించిన రుచిలో
నీ ఆశీర్వచనం నారీ సన్నిధి తలవాల్చిన పౌరుషమై
ఈ బలహీనపు క్షణికంలో మనలేనిక నేను.

అమ్మా
చతురవస్థలు నాలుగుమెట్లలా ఎక్కకుండా
నాకు మహాయానం ప్రసాదించు
అరి షడ్వర్గాన్ని దాటించు
నామాతృక సంధించిన జుగుప్సారూపకానికి
ఆఖరి ప్రస్తావన చెయ్యి

రక్త సంబంధం

అనుముల కృష్ణమూర్తి

నీకూ
నాకూ
నల్లని నీగ్రోకూ,
తెల్లని ఎస్కిమోకూ
గుణమొక్కటి ఉమ్మడి— నెత్తుటిలో ఎర్రదనం తడి—
ఇంకా పొత్తొక్కటి అదనం—
మా నెత్తుటిలో వెచ్చదనం—
ఈ మన చిరంజీవి సత్యానికి యాభయ్యే వయసంటే
పుడమి తల్లి గర్భంలోపడి, ఎదిగిన దెన్నివేల ఏండ్లో?
భద్రంగా పురుడుజేసి పొత్తిలిలో పెట్టగ ఎన్నివేలఏండ్లదాశ్రమ
ఆ పురుటినాడు ఎందరి మోములలో ప్రొద్దులు పొడిచినవో।
నాకూ, నీకూ, నీగ్రోకూ ఇంకా జ్ఞప్తికి ఉంది.

నీ బీళ్ళల్లో మందారం పూసిందని,
తన చెక్కిళ్ళలో ఎర్రగులాబీ వేసిందని ఎస్కిమో,
నల్లనిదొడ్డు పెదాలచివర చిరునవ్వులు మెరిసినవని నీగ్రో,
కనుకొలకుల నిండిన దాస్యజలాల్లో స్వాతంత్ర్యారుణ పద్మం
మొలిచిందని నేనూ,
మురిసి మురిసి చెప్పుకున్నదిదే రోజు,
ఇదే తేదికదూ।

నెత్తుటిలో ఎర్రదనం, వెచ్చదనం, తడితో
మనముమ్మడిగా
పుడమితల్లి మొహాన కుంకుమ బొట్టును చూచామే?
ఇదేరోజు ఇదేతేది కదూ।

ఆ అరుణోదయ నవకిరణం
ధ్రువం నుండి ధ్రువందాక ప్రాకాలని
కలకాలం ధ్రువతారగ నిలువాలని
చలికాలం పోవాలని
చెలికారం రావాలని
మురిసి మురిసి కోరుకున్నదిదే రోజు, ఇదేతేది కదూ।

నేటి నుండి రేపులోకి
రేపు నుండి అనంతం దాక
మానవతను ఒక్కుమ్మడిగా
సహస్రకోటి శతపత్రంగా ఉత్ఫుల్లం చేస్తుందని
మురిసి మురిసి వేడుకున్నదిదే రోజు, ఇదేతేది కదూ।
మన చరిత్ర మానవతా చరితంగా
మలచబడినదిదే రోజు, ఇదే తేదికదూ।

వృషభ పురాణం

పేర్వారం జగన్నాథం

శ్రీ అంతంబగు ఇండియా దేశాన
ఆంగ్లభూధవుల రాజ్యం ముగిశాక
చిత్తశుద్ధిలేని శివపూజ జేసేటి
వృషభరాజు కథను విన్నవింతు.

  శుకనినింద.

అష్టాదశ పురాణాల పిదప
అతి లేటెస్టుగా వెలువడింది
పరాశర వ్యాస వాల్మీకాదులు
టెన్ పర్సెంట్ రిట్రెంచ్‌మెంట్‌లో
ఊడిపోయిన ఉద్యోగస్థులు;
పాల్కురికి సోమ(రి) నాథుని
బసవ పురాణం కన్నా
అన్నింటిలో ఇదేమిన్న.

  అవతారిక.

పూర్వం పరమేశ్వరునికి
వాహనంగా ఉన్న వృషభరాజం
పాములతో పగబూని—వాటితో సరిపడక
దీనజనోద్ధరణకోసం కంకణం కట్టుకొని
హిమాలయాల్లో తలక్రిందులుగా
భగీరథ తపస్సుజేసి
ఆదనంగా కొన్ని కొమ్ములు మొలిపించుకొని
అవతరించింది భూలోకంలో,
పాముల్ని వంట చెరుకులుగా వాడుదామని
పందెంలో జనమే జయుణ్ణి జయించాలని.

భూమిపై కాలుమోపిందో లేదో
అంగ వంగ కళింగ దేశాలన్నీ
తిరిగివచ్చి, అంగబలాన్ని చేకూర్చి
భరతవర్షే, భరతఖండే
మేరోర్దక్షిణ దిగ్భాగానికి
పట్టం కట్టుకుందా మనితలపోసి
విక్రమార్కుని సింహాసనం
ఉజ్జయినిలో సంపాదించి
ఎక్కడానికి వెళ్ళగా
ముప్పదిరెండు సాలభంజికలూ
ఫక్కున నవ్వాయి.
అర్జెంటుగా దేశాన్ని కుదువపెట్టి
న్యూయార్కు నుంచి నెమలి సింహాసనం
మాస్కోనుంచి రత్నరాజిత కిరీటం
మేడిన్ ఇంగ్లాండ్ మేజోళ్ళు
విమానంలో తెప్పించి
దీనజనుల పాలిటి
కామధేనువులా పోజుపెట్టి
పట్టాభిషేకం చేసుకుంటే—
సింహశార్దూల మత్తాభాదులు
శిష్యత్వం స్వీకరించాయి
ఆనాటి సభ అచ్చంగా
కణ్వాశ్రమంలా విరాజిల్లింది.

మరునాడు ప్రొద్దు పొడవకముందే
వైతాళికులు నిదురలేపగా
బుద్ధ గయలో బౌద్ధ మతం స్వీకరించి
అశోక సమ్రాట్టు సమాధిపై
పూలగుచ్ఛం సమర్పించి
రాజధానికి తరలివస్తూ

దారిలో కనపడ్డ గోవుల్ని
వధ్యశాలకు పంపింది.
ఇదేమంటే— "మనకు
శిబిచక్రవర్తి లాంటి ప్రభువులు
ఆదర్శం సుమా" అన్నది.

సదరు వృషభ రాజం
పరిపాలన సాగించింది లగాయతు
సామాన్యుడు— అంతకన్నా తక్కువవాడు
పస్తులున్న దినం లేదు
ప్రాణం అంతకన్నా లేదు.
లంచాల్ని ఎరువులుగా పోసి
విషముష్టి కాయలు పండించేవాళ్ళు
నూటికి తొంబది తొమ్మిదిపాళ్ళు
పండిన సరుకునంతా అంగట్లో పోసి
తునికి పండ్లని నమ్మించి
పెరుగుతున్న జనాభా సమస్యను
పరిష్కరిస్తారు షావుకార్లు.
గర్భధారణ మూడుపాళ్ళు
తన్నాశః ముప్పదిపాళ్ళు
మంత్రి పదవులు నాలుగుపాళ్ళు
నాయకోదయం నలుబదిపాళ్ళు.
ఆ దేశంలో రోగాలు తప్ప
సమ్మెచేయని వస్తువేలేదు
కృష్ణ పక్షంనాటి చంద్రుడు
ఏడువలేక నవ్వుకునే దరిద్రుడు.
ఇదీ మన భారతదేశం
ఏనాటి పుణ్యమో ఏయోగ బలమో
జనియించినాడవీ భరతదేశాన.

మేధావులూ వారినైతిక బాధ్యతలూ

కె. వి. రమణారెడ్డి

ఇంగ్లీషు భాషలోని 'ఇంటలెక్చువల్'కు సమానార్థకంగా 'మేధావి' అనేమాటను, రష్యన్ భాషనుంచి ఇంగ్లీషులోకివచ్చిన 'ఇంటెలిజన్షియా'కు సమానార్థకంగా 'బుద్ధి జీవులు' అనే మాటను తెలుగులో వాడుతున్నాము. మొదటి మాటకు person possessing a good understanding, enlightened personఅని రెండవదానికి the part of a nation that aspries to independent thinking అనీన్నీ 'దికన్సైజ్ ఆక్స్ఫర్డ్ డిక్షనరీ' అర్థం చెబుతున్నది.

'ది హిందూ' పత్రిక (1987 డిసెంబరు 29)లో the Intelligentsia in Indian politics అనే వ్యాసంరాస్తూ ఏ. యస్. సత్యనాథన్ ఇలా బుద్ధిజీవులను వర్ణించాడు.

It is that part of the educated classes who are credited with the capacity for objective, independent thinking–men in the learned professions, lawyers, accountants, business and service executives, economists, journalists, artistes, writers, thinkers–who constitute the intelligentsia.

బాగా అభివృద్ధిపొందిన దేశాలలోకూడా బుద్ధిజీవులది అల్పసంఖ్యాక వర్గమేనని ఈ నిర్వచనం బట్టితెలుస్తుంది. విద్య సమాజమంతటా వ్యాపించని మనదేశంలాంటి వెనకబడిన దేశాలసంగతి మరిచెప్పేపనిలేదు.

బుద్ధిజీవులు చూపెట్టిన తోవలో ప్రభుత్వాలునడిచే అలవాటు ఎక్కడాలేదు. అయినా, యుద్ధంవచ్చినా అక్రమం జరిగినా స్వేచ్ఛదెబ్బతిన్నా నియంతృత్వం విజృంభించినా బుద్ధిజీవులు యూరపియన్ దేశాలలో పలువిధాలుగా నిరసన తెలుపుతూ వస్తున్నారు. ప్రభుత్వాల ప్రచారాలను వేదప్రమాణాలుగా ఒప్పుకోకుండా, నిజం బయల్పడడం కోసమైనా, ఈ పనులు అవసరమౌతున్నాయి. మన దేశంలోకూడ రవీంద్రకవి వంటి మహామేధావి జలియన్‌వాలాబాగ్ వధ సందర్భంలోనూ, ద్వితీయ ప్రపంచ యుద్ధానికి

ముందుకాలంలోనూ తన అభిప్రాయాలను నిర్భయంగా ప్రకటించిన ఘటనలున్నాయి. ఫ్రాన్సులో హెన్రీ బార్బూజ్, రోమాఁరోలాఁ తదితరులు తయారుచేసిన యుద్ధవ్యతిరేక ప్రకటనపై బెర్నార్డ్‌షా, గాల్స్‌వర్దీ, గార్కీవంటి వారితోకలిసి రవీంద్రుడుకూడా సంతకంచేశాడు. బెంగాల్‌రాష్ట్రం నేటివరకూ ఆ సంప్రదాయాన్ని నిలబెట్టుతున్నది. ఇటీవలి కాలంలో సెతల్వాడ్, యస్. సి. ఛటర్జీ, పి. యస్. సప్రూవంటి న్యాయ శాస్త్రవేత్తలు అనేక సందర్భాలలో ముఖ్యసమస్యలపై తమ అభిప్రాయాలను అభిప్రాయభేదాలను ప్రకటిస్తూ దేశంలోని ఆలోచనాపరులకు పనిబెట్టగలుగుతున్నారు. బుద్ధిజీవులు ప్రజలరాజకీయ, ఆర్థికజీవితాలపై తమ ప్రభావాన్ని నెరిపేందుకు పాశ్చాత్య ప్రజాతంత్ర దేశాలలో ఉన్నటువంటి అవకాశాలు మనదేశంలో లేవని, పైన పేర్కొన్న వ్యాసకర్త తేల్చిచెప్పాడు.

పాశ్చాత్య ప్రజాతంత్ర దేశాలలోకూడా మేధావులనైతిక కర్తవ్యాల గురించి తర్జన భర్జనలు జరుగుతున్నాయి. వియత్నాంలో జరుగుతున్నయుద్ధమూ, అరబ్బులకూ ఇజ్రాయిల్‌కు మధ్యజరిగిపోయిన యుద్ధమూ, ఈ వాదప్రతివాదాలకు సందర్భాన్ని కల్పించాయి.

ప్రపంచ రాజకీయ సమస్యలగురించి తగుదునమ్మా అని అభిప్రాయాలు వెలిబుచ్చడానికి ఇతరులకెవ్వరికీ లేనియోగ్యత ఈ మేధావి వర్గానికెలావచ్చింది? ఏమిటి వీరిగొప్ప? వీళ్ళు ఆలోచించేపాటి ఇతరులు ఆలోచించకనా? తమతమ వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలను కిందికినెట్టి, వస్తువును వస్తుపరంగాచూచే 'ఆబ్జెక్టివ్' దృష్టి నలవరచుకొని, 'స్వచ్ఛందం'గా వీళ్ళు ఆలోచించగలరా? ఇలాంటి ప్రశ్నలు బోలెడు ఎదురౌతున్నాయి. తమ సంప్రదాయానికి తామే గోయి తవ్వుకొంటున్న పాశ్చాత్య ప్రజాతంత్ర దేశాల మేధావుల్లో అందరూ ఒక తాటిమీద నడవడంలేదు. జాఁపాల్ సార్త్ (jean-paul sartre) వంటి మేధావులు కొందరు ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణకు పూనుకోకపోయినా, తటస్థత వహించకుండా ఒక పక్షంవైపు బలంగా మొగ్గుతున్నందుచేత వాళ్ళను "engage "అనే ఫ్రెంచిమాటతో ఒకగాట కట్టివెయ్యడం జరుగుతున్నది. ఒక మహా సంక్షోభం ఏర్పడినప్పుడు బెర్ట్రాండ్ రస్సెల్ ప్రతిదఫా లోకానికంతా తెలిసేంతగా తన గొంతెత్తి తానే ఒక న్యాయమూర్తి అవుతున్నాడు. వియత్నాం యుద్ధంలో జరుగుతున్న అమానుష విధ్వంసకాండ గురించి విచారించి తీర్పుచెప్పేందుకు అంతర్జాతీయ న్యాయస్థానంలాంటి ఒక మేధావుల బృందాన్ని ఆయన ఏర్పాటుచేసిన సంగతి సర్వజనవిదితమే.

పశ్చిమ యూరపుదేశాలలో మేధావుల నైతికబాధ్యత గురించిన గుర్తింపు కనీసం 18వ శతాబ్దిచివరి భాగంనుంచి ఉంటూవస్తున్నది. దానిని Age of Enlightenment అనిచరిత్ర వ్యవహరిస్తున్నది. దానికి ఎంతోముందు 'రినేజాన్సు' దినాలలో (15–16 శతాబ్దులు) ఎరాస్మస్, తర్వాత 17వ శతాబ్దిలో మిల్టన్ మహాకవి, 18వ శతాబ్ది చివర వోల్తేర్(voltaire), 19వ శతాబ్దిలో బైరన్‌కవి, గెథే(Goethe)కవి, చివరిభాగంలో ఎమిలేజోలా (Emile zola)— ఇలాంటి మేధావులందరూ ఆ నాళ్ళ ఘటనలతో ఏకీభవించక తమ వేర్పాటును స్థాపించుకొన్నారు. 1936లో స్పానిష్ అంతర్యుద్ధ కాలంలో రిపబ్లిక్ సంరక్షణకై కవులూ కళాకారులూ నేరుగాయుద్ధంలోనే పాల్గొన్నారు కూడా. ఇదీ అక్కడి సంప్రదాయం.

ఇప్పుడు ఊగిసలాంటి ఈ మార్పు ఎందుకువచ్చినట్లు? పాశ్చాత్య ప్రజాతంత్ర దేశాలుగా పేరుబడిన బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా వగైరాలొకవైపు. కమ్యూనిష్టు 'నియంతృత్వ' దేశాలుగా పేరుబడిన తూర్పు యూరపుదేశాలు, రష్యా వగైరా లింకొక వైపు తమతమ భావజాలాలకోసం (Ideology) పెనగులాడుతున్నాయి. బ్రిటన్, ఫ్రాన్సువంటి దేశాలకులోగడ ఉండిన వలసరాజ్యాధిపత్యాలు ఊడాయి. కమ్యూనిజం వ్యతిరేకత అమెరికాకు మంచి అనుకూల్యాన్ని కలిగిస్తున్నది. ద్వితీయ మహాయుద్ధం తర్వాత చెదురు మదురుగా స్థానికంగా యుద్ధాలు జరుగుతూన్న నేటిరోజులలో మేధావులు మునుపటివలె కూటంకట్టి ఇరుపక్షాలలో ఒక దానిని వెనకవేసుకొచ్చేవీలు ఎక్కువలేకుండా ఉంది. నేరుగా తమ మాతృదేశాలకు ఈ యుద్ధాలతో ప్రమేయం ఉండడం, ఒకప్పుడు మేధావులను విపరీతంగా ఆకర్షించియుండిన కమ్యూనిస్టు భావజాలం సోవియట్ రష్యా కార్యాచరణలో వికృతమైపోవడం, "భ్రమలు" నీరుగారిపోవడం, అలనాటి రాజకీయవ్యామోహాలైన మేధావులలో ఒక్కొక్కరు తప్పకొని 'వృద్ధనారీ పతివ్రతా' చందంగా మితవాదులు కావడం — ఇవన్నీ కారణాలుగా కనిపిస్తాయి. ఉదాహరణకు, 1930—40 మధ్యకాలంలో ఆంగ్లయువకవులకు నాయకుడైన ఆడెన్ (Auden) ఇప్పుడు మేధావులకు—ముఖ్యంగా సాహిత్య పరులకు రాజకీయ ప్రమేయాలెందుకని ప్రశ్నిస్తున్నాడు:

Why writers should be canvassed for their opinion on controversial issues I cannot imagine. Their views have no more authority then those of any reasonably well-educated citizen.

Authors take sides on vietnam అనే గ్రంథంలో ఆడెన్ రాసిన వ్యాసం ఏ ధోరణిలో సాగిందో ఈ మచ్చుతునక చెబుతుంది. "ఎన్‌కౌంటర్" పత్రిక 1967 సెప్టెంబరు, అక్టోబరు సంచికలలో Intellectuals and just causes అనే అభిప్రాయవేదికను నిర్వహించింది. అందులో చాలామంది రచయితలు, మేధావులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి నీరద చౌదురీకూడా.

హాన్స్ మార్గెంథోది సాంప్రదాయికమైన దృక్పథమనవచ్చు. ఇది మేధావుల ప్రత్యేకతను, వారి నైతిక బాధ్యతలను గుర్తిస్తుంది. అయితే మేధావి వట్టిమేధావిగా మాత్రమే లోకసమస్యలను పట్టించుకొనేందుకు ప్రత్యేకించి దక్షతగలవాడనుకో కూడదు. ఆ దక్షత ఇతరులది. ఇదమిత్థమని చెప్పదగిన ఒక ప్రయోజనానికి గాని ఒక స్థానానికిగాని కట్టుబడి ఉండరు కాబట్టి మేధావి వర్గానికి ఈ ప్రత్యేకత. సత్యానికే వారికట్టుబాటు: సత్యదర్శనంలో పొరబాట్లు జరగవచ్చు. అభిప్రాయ ప్రకటనలో ఒక పక్షానికి ఆసరా దొరకవచ్చు. అలాంటి అభిప్రాయ ప్రకటనవల్ల వెనువెంటనే ఏ ఫలితాలూ లేకపోవచ్చు—అయినా—

Still, the intellectual has a vital function to perform, a function that is both moral and practical. By confronting the powers that be with the truth, they erect a standard by which the action of the government can be judged. They speak, in the Biblical phrase, truth to power. By doing this, they engage in a dialogue which establishes the intellectual respectability and, hence the practical possibility of alternative policies. Thus the intellectual, by providing an indipendent standard of evaluation, also provides the possibility for political change.

నిజంచెప్పడానికీ నీతికి నిలబడడమనే దొక్కటే చాలదు. విషయపరిజ్ఞానంలేనిదే నిజం వెలువడదు. తెలిసీతెలియని స్థితిలో నైతిక సూత్రాలను వెదజల్లుతూ పోవడంవల్ల లాభం ఉండదు సరికదా, నష్టం ఉంటుంది. ఈ దృష్టితో ప్రొఫెసర్ మేక్స్‌బెలోఫ్, రాబర్ట్ కాంక్వెస్ట్, హైబర్ జామ్యూలీ ప్రభృతులు మేధావుల పనికిమాలినతనాన్ని గూర్చిరాశారు. చాలామంది మేధావులకు ఉన్నదంతా ఆ మేధావిఅనే పేరేనంటాడు బెలోఫ్. పైదేశిక వ్యవహారాలను "నైతిక"మైన తీర్పు చెప్పవలసివచ్చేసరికి. మాస్కో విచారణలను సమర్థించిన వాళ్ళమొదలు, కొరియాయుద్ధంలో అమెరికా క్రిమి ఆయుధాలను ప్రయోగించిందని నిరసనతెలిపిన వారివరకు ఎందరో ముద్దాయిలు

(Giulty men) మేధావుల్లో కనిపిస్తారంటూ కాంక్వెస్ట్ రాశాడు. సర్వరోగనివారిణిని ముల్లెలో పెట్టుకొని ప్రతి అంతర్జాతీయ సమస్యను దాన్ని వాడజూచే ఈ భిషక్కుల భేషజాలను సామ్యూలీ హేళన చేశాడు. మేధావులనబడేవాళ్ళు ఆ మేధస్సుకు పని పెట్టకుండా ఉద్రేకాలపాలై అగుడునమ్మా అంటూ తీర్పుచేయబోవడం తెలివితక్కువ, అన్నాడు. లుముంబా, కాస్ట్రోలాంటి కల్పితవీరులను మెచ్చుతూ, జాన్సన్‌లాంటి కల్పిత దుష్టులను ఖండిస్తూ, యదార్థ ప్రపంచంనుంచి తప్పుకొని కల్పిత ప్రపంచంలో చరిస్తూ ఉన్నారట "అభ్యుదయ" ముద్రాంకితులైన మేధావులు. తమ దేశానికి సంబంధించినంతవరకు అందరూ ధర్మపన్నాలు చేప్పేవారే. తమస్వదేశానికి అతి దాపునఉన్న నియంతృత్వరాజ్యానికి ఎంత ఎక్కువదూరం ఉంటే, అంత ఎక్కువ అభ్యుదయాంశ మేధావుల అభిప్రాయాలో ఉంటుందంటాడు సామ్యూలీ. పశ్చిమదేశాల ప్రజాతంత్రవ్యవస్థను విమర్శించినంత తీవ్రంగానూ తరచుగానూ నియంతృత్వ దేశాలను విమర్శించే అలవాటు వీరికి లేదట.

The real mainspring of intellectual emotionalism seems to be a strange compound of irrational guilt, self hatred, antic Americanism, wishful thinking, power-worship, and arrogance A considerable eliment of hypocricy comes into it as well.

ఆంగ్లో—సాక్సన్ దేశాలలో మేధావులను అధికారస్థానాలకు ఎంతో కొంత దూరానపెట్టి, వారిరాజకీయాభిప్రాయాలను ఖాతరుచెయ్యని సంప్రదాయం ఒకటిఉంది, దాన్ని పునరుద్ధరించాలంటాడు ఈ రచయిత.

రెండు సంప్రదాయాలున్నాయి: తప్పని నమ్మినదాన్ని గర్హించేదొకటి, తమ తప్పును చూచీ చూడనట్లు ఊన్నకుండేదొకటి. మొదటిదానికి మోర్గెంథో, రెండవ దానికి కాంక్వెస్ట్, సామ్యూలీ ప్రభృతులు ప్రతినిధులని ఈ చర్చవల్ల తేలింది. ఇప్పుడు ఈ ప్రజాతంత్రదేశాల పునాదులు కదలబారుతున్నాయి కాబట్టి, మేధావులలో వెనకటి సత్సంప్రదాయంపట్ల గురి సన్నగిల్లుతున్నది. My country, right or wrong అనిన బైరన్‌కవి వాక్యం శిరోధార్యమౌతున్నది. అయితే ఆ బైరన్ కవి స్వదేశంలోని దుష్పరిపాలకులను కంటగించుకొని, గ్రీసువంటి దేశాల స్వేచ్ఛాసమరాల్లో పాల్గొని ప్రాణార్పణమే చేశాడని మరుస్తున్నారు. ఆ వెనకటి నైతిక సంప్రదాయం బెర్ట్రాండ్ రస్సెల్, జాపాల్‌సార్త్ వంటి ఉత్తమ మేధావులను ఇంకా అంటిపెట్టుకొని ఉంది.

అభివృద్ధి చెందవలసిన మనదేశంలాంటి దేశాలలో మేధావులని పిలవదగినవారు, మోర్గెంథో అన్నట్లు, అధికారం ముందు సత్యం మాట్లాడవలసిఉంటుంది. ఉన్నత నైతిక ప్రమాణాన్ని స్థాపిస్తే ఎప్పటికైనా వాస్తవానికి అదికొలబద్దకాదా? ★

కళాశాల విద్యార్థుల

స్వచ్ఛంద కవితా రచన పోటీ ఫలితాలు

సృజన నిర్వహించిన పై పోటీకి ఆంధ్ర దేశంలోని దాదాపు అన్నికళాశాలల నుండి డెబ్బది దాకా స్వచ్ఛంద కవితలు వచ్చినవి. వానిలో ఈ క్రిందివి బహుమా నార్హములుగా నిర్ణయింపబడినవి.

ఆధునిక దృక్పథమూ, ప్రయోగశీలత్వమూ, సృజనాత్మక శక్తి అనే సృజన ప్రధానాశయాలతోపాటు ఈ పోటీలో ప్రకటించినట్లుగా కొత్తదనమూ, మౌలికతా, జీవమూ అనే అంశాలనుకూడ కొలమానంగా పెట్టుకొని న్యాయనిర్ణేతలు ఈ నిర్ణయం చేశారు.

'చీకటిలో బ్రతుకు నీడ'ను ఉత్తమకవితగా నిర్ణయించి 'యిందులో గ్రుడ్డివాని చరిత్ర దయనీయంగా వర్ణించబడింది. కవితలో ఆధునిక దృక్పథం, సృజనాత్మక శక్తి లోపించలేదు. రసహృదయాన్ని కదలించగలరచన. నిర్దుష్టంగా వుంది' అని అభిప్రాయపడ్డారు.

అల్లే 'కత్తి కార్చిన కన్నీరు'కు ప్రత్యేక బహుమతి ఇవ్వాలని నిర్ణయిస్తూ 'వస్తువు, ప్రయోగాలు, స్పష్టత ఇందులో ప్రత్యేక గుణాలు'గా పేర్కొన్నారు.

వివరాలు ఇవి:

ఉత్తమ కవిత:	చీకటిలో బ్రతుకు నీడ
కవి:	అమ్మంగి వేణుగోపాల్
	ఎం. ఎ. ప్రథమ (తెలుగు)
	ఉస్మానియా ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలెజ్ హైదరాబాదు-7
ప్రత్యేక బహుమతి:	కత్తి కార్చిన కన్నీరు
కవి:	ఎన్. గోపి (పూర్తి పేరు: ఎన్. గోపాల్)
	బి. ఎ. ప్రథమ (పై కళాశాలే)

ఇవేగాక ఈ క్రింది కవితలు, ఇంకా మరికొన్ని కవితలుకూడ ప్రచురణ యోగ్యమయినవిగా నిర్ణయించబడినవి. అవి వీలుననుసరించి రాగలసంచికలలో ప్రచురింపబడును.

1. పల్లవిస్తూన్న వసంతం — 'ప్రకాశకుమార్' (కె. వి. ఎస్. ప్రకాశరావు. బి. ఇ. ఫైనల్. ఆంధ్రా యునివర్సిటీ ఇంజనీరింగ్ కాలెజ్, వాల్తేర్)
2. అగ్ని పంజరం.— ఎస్. నారాయణ చౌదరి (విద్వాన్ 4వ సంవత్సరం. ఎస్. వి. ఓరియంటల్ కాలెజ్, తిరుపతి)
3. కూలి— అమృతలత (పి. యు. సి. ఆర్ట్స్, మహిళా కళాశాల, నిజామాబాదు.)

ఈ పోటీ నిర్వహణలో సహకరించిన రచయితలకు, ఆయా కళాశాలాధికారులకు, న్యాయనిర్ణేతలకు, అభిమానులకు అందరికీ మా హృదయ పూర్వక ధన్యవాదాలు.

—సంపాదకుడు.

అయ్యంగి వేణుగోపాల్:

'చీకటిలో బ్రతుకునీడ'లో అంధుని అంతర్వేదనకు అక్షరరూపం ఇవ్వాలని ప్రయత్నించాను. అయినా ఇందులో అంధునికి అన్వయించే కనురెప్పలను కంటి పాపలనుకూడ రక్షకులుగా, ఊతకర్రను ఆసరాగా చేసుకోవడాన్ని పరాధీనతగా, చేతివేళ్ళ చివరలను భౌతిక నాగరికతను ఆకర్షించే అసంస్కృత దృక్కులుగా, చెవులు చూడడాన్ని మనిషిలోని అవిశ్వాసంగా అన్వయించుకుంటే ఈ కవిత అంధులకేకాక తరుణం మించిపోయిన తర్వాత హృదయ నేత్రం సగం విప్పిన వారందరికీ అన్వయిస్తుందని నేను భావిస్తున్నాను.

నా వయస్సు 19 సంవత్సరాలు. రెండేళ్ళనుంచి వచన గేయాలు రాస్తున్నాను. నేటి యువకవి, ప్రతి చిన్న విషయాన్నీ, పెద్ద విషయాన్నీ, నిత్యనూతనమయిన నిశిత పరిశీలనా దృష్టితో, సరికొత్త కోణంలోనుంచి చూడగలగాలి. సజీవ సృష్టి చేయగలగాలి.

ముఖ్యంగా స్వచ్ఛంద కవితయొక్క గొప్పదనాన్ని అర్థంచేసుకోవాలి. ఈ ప్రక్రియమీద తన వెనుకటి తరంవారి సానుభూతినీ, సద్భావాన్నీ సంపాదించవలసిన అవసరం ఎంతైనా వుంది. అంతేకాకుండా తన ముందు తరాలవారికి ఆసక్తినీ, గౌరవాన్నీ కలిగించవలసిన బాధ్యతకూడ అతని మీదేవుంది.'

చీకటిలో బ్రతుకు నీడ

అమ్మంగి వేణుగోపాల్

ఇంకా
నా కళ్ళను కాపాడుతున్నా మనుకుంటున్న
కనురెప్పలకు
దృశ్య ప్రపంచానికి దూరమైనానని
దుర దృష్టానికి మారుపేరైనానని
ఎలా చెప్పను?

సుడిగాలి దాడిలో, వెలుగును కోల్పోయిన దీపాన్ని
చీకటి సముద్రం నడుమ, దిక్కులు చూస్తున్న ద్వీపాన్ని
నాలుగు గోడల నడుమ నడువలేనివాణ్ని
నా నీడను నేనే చూడలేనివాణ్ని
కంటిపాపలు మింటికెగసి పోయినప్పటి నుండి
చంటిపాపలా ఏడుస్తున్నవాణ్ని

ఒంటరిగా,
ఈ సుదీర్ఘ కాళ రాత్రిని
ఈ అస్తమించని అమవసను
ఎలా గడపను?

నా కన్నీరు,
ఆనంద హాసపు సెలయేరుకాదు
చందనం పరిమళించే తొలకరికాదు
నా జీవితం,
పుష్పపథం మీది రథంకాదు
పూర్ణిమ జ్యోత్స్నా జలపాతం కాదు

నాకు దేవుడు ఋణపడివున్నాడు.
అందుకే.
ఊపిరి పోసుకున్న ఊతకర్ర
చాపకుండా కాపాడుతోంది
*చేతివేళ్ళ చివరలపైకి
కాంతి కిరణాలు పరావర్తనం చెందుతున్నాయి.

అందుకే.
ప్రకృతి రంగస్థలంమీది
మీ అంతరంగాలలోని
రంగు రంగుల దృశ్యాలను
నా చెవులు చూస్తున్నాయి.

సూర్య రశ్మిని పడబోసే చంద్రుడు
నాకక్కర్లేదు.
సుదూరంగా, అంధకారంలో మెరిసేచుక్కలు
నాకక్కర్లేదు.

మీరంతా అస్పృశ్యులు.
అందుకే, నాచూపులు
తమచుట్టూ చీకటిదడి అల్లుకున్నాయి.

క్షమించండి.
నన్ను నేను సంతృప్తి పర్చుకోవాలని
లేని ర్యాన్ని నటిస్తూ ఏమేమో అన్నాను.

నేను చూడలేక పోయినా,
నాముఖంలో దాగుడుమూతలాడుతూన్న
విషాద ఛాయల్ని మీరు గమనించేవుంటారు.

---

*అంధులు తమప్రత్యేక లిపియైన 'బ్రేల్లి'ని (Braillee script)
[illegible] వేళ్ళ చివరలతో తడుముతూ చదువుకోగలుగుతారు.

నా కళ్ళు శవాలు
అలంకార ప్రాయాలు
వాడిన పూలు

ఇంత కఠిన సత్యాన్ని మరిచిపోయి
మీ చాలీచాలని జాలినీ, సానుభూతినీ
బలవంతంగా జీర్ణించుకుంటూ,
ప్రతిక్షణం మీ ఊపిరినే పీలుస్తూ,
ఎన్నాళ్ళని ఇలా బ్రతుకును?

Statement about ownership and other particulars about newspaper

SṚJANA

1.	Place of publication	Jadcherla
2.	Periodicity of its publication ...	Quarterly
3.	Printer's Name	Vara Vara Rao
	Nationality	Indian
	Address	Jadcherla (S. C. Rly.) Dist. Mahbubnagar. A. P.
4.	Publisher's Name	Vara Vara Rao
	Nationality	Indian
	Address	(As above)
5.	Editor's Name	Vara Vara Rao
	Nationality	Indian
	Address	(As above)
6.	Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	—

I, Vara Vara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Vara Vara Rao
Signature of Publisher

కత్తి కార్చిన కన్నీరు

ఎన్. గోపి

కత్తి రక్తనేత్రాల
నొత్తుకుంది.
మనకు తెలియని భాషలో
మౌనంగా మొత్తుకుంది.

హత్యలు చేసిచేసి
అలసి పోయిందేమో.
గుండెలు చీల్చి చీల్చి
కుమిలి పోయిందేమో.

కంపు కొడుతున్న
కెంపు చేతుల్లో వుండలేక
ఒళ్ళు తిరిగిపోయి
తల్లడిల్లిందేమో.

ఎంతో వాడిగల కత్తి
ఎర్రతామర రేకులాగైంది
అరుణతిలకాల నదృశ్యం చేసేకత్తి
కరుణకావ్యంగా మారింది.

దీర్ఘ దీప శిఖలాంటి కత్తి
సింధూరరేఖలాంటి కత్తి
సంధ్యను చీలికలు చేస్తె
సాకారమొందినట్లున్న కత్తి.

రక్త బాష్పాలు రాల్చింది.
విరక్తి భాష్యాలు చెప్పింది.
బుద్ధుని అహింసావాదాన్ని
పునః ప్రవచించింది.

కత్తికి కాళ్ళుంటే
కర్కషాత్ముల పైనే దూకేది.
ఆత్మధారా కాంతులతో
ఆనందాన్నే కలిగించేది.

చిలుము దుప్పటి కప్పుకొని
నిద్రించాలనుంది కత్తికి.
చీకటింట్ల మారుమూలల్లో
చేరి పోవాలనుంది కత్తికి

ఐనా—

ఖడ్గఘోష వినేదెవ్వరు?
కారుణ్యయోషను వలచేదెవ్వడు??
అహింస హంసలా నడచి వచ్చేదెన్నడు?
ఆనందం మందారంలా విచ్చేదెన్నడు??

కత్తికీ మిత్తికీ
కలహం రావాలి.
కత్తి కొత్త సిద్ధాంతాన్ని వెలిగించే
వత్తిగా మారాలి.

ఎన్. గోపీ: పూర్తి పేరు ఎన్. గోపాల్. వయస్సు 17 సంవత్సరాలు.

"Easy life కు అలవాటుపడుతున్న, జాడ్యాన్ని పులుముకొని త్రుప్పు పడుతున్న మనవాళ్ళ గుండెలు కదిలించాలనే ఉబలాటం. (పేరాశ అంటే బావుంటుంది.) ఏ రకంగానయినా పఠితను కదిలించగలగాలి కవిత్వం. కవిత్వం హృదయానికి సంబంధించిందన్న విషయాన్ని నేనెన్నడూ మరచిపోను. ఈ సాహిత్య విప్లవం నేటి సమాజాన్ని పూర్తిగా ప్రభావితం చేసే తరుణం వస్తుంది. సంకెలలు సడలి సౌజన్యమూ సౌభ్రాతృత్వమూ పెరిగితే మన ఉద్యమం వర్ధిల్లి, మన విప్లవ పతాక కాంతిలోకానికి పయనించే నౌకగా మారుతుంది."

'ఖడ్గసృష్టి' సమీక్ష సమీక్ష సమీక్ష.

సుమనోధార్మికవేల

త్రిపురనేని వెంకటేశ్వరరావు

(సృజన '67 మే సంచికలో 'పునః కార్మికశాల' అనే శీర్షికతో కె. వి. రమణారెడ్డి చేసిన 'ఖడ్గ సృష్టి' సమీక్ష సమీక్షకు సమాధానం.)

కవికి స్పష్టమైన దృష్టివుండాలి. అదిలేకుండ ద్రష్టకాలేడు. శ్రీశ్రీది మార్క్సియను దృష్టికావాలి. కాని, దానితో పొంతనలేని సర్రియలిజంకూడ ఆయన అవలంబించాడు. పరస్పరం విరోధించే మార్క్సిస్టు—సర్రియలిస్టు తత్వాల కలగూర గంప శ్రీశ్రీ.

నా పదినిమిషాల రేడియో ప్రసంగవ్యాసంలోని ప్రధానాంశం ఇది. నాతో విభేదించి వ్రాసినవ్యాసంలో యీ ప్రధానాంశానికి సంబంధించి వ్రాసినంతలో రెడ్డిగారు,

(శ్రీ శ్రీ) సర్రియలిజం అనే వెర్రిలోపడిన రోజుల్లో చేసినరచనలుగాని, చిత్ర కవిత్వం పద్ధతులను తలకెక్కించు కొందామని చేసిన రచనలుగాని, దాదాపు యినుప గుగ్గిళ్ళైనని చెప్పాలి.

"మార్క్సియన్ దృక్పథానికీ, ఫ్రాయిడియన్ దృక్పథానికి చుక్కెదురు." సర్రియలిస్టులు "బూర్జువావర్గపు అంతిమ ప్రతినిధులు అరాచక మార్గావలంబులైతే కావచ్చు."

ఇంక నా విమర్శతో తగూపడవలసినంత కారణం లేదేమో?

"గొప్పకవులెందరో యీ ప్రక్రియను చేబట్టారు. దానిలోనూ సుగుణమేదో వుండాలి. ఫ్రాన్సులో ఆరగాఁ, ఇక్కడ శ్రీశ్రీ—ఇద్దరూ కొంతకాలమే సర్రియలిస్టులైనా, తదనంతర కాలానవారు రాసిన అభ్యుదయ కవిత్వం సర్రియలిస్టు పద్ధతివల్ల సంపన్నమైనదే కాని ఎక్కువగా నష్టపోలేదు." అంటున్నారు. సరే మంచిమాటే। వెర్రిలోనూ, విరోధిలోనూ గుణం చూడగలగడం గొప్పే। అభివృద్ధి లక్షణమే.

అయితే ఆ సుగుణమేదో ఎన్ని చెప్పుకోవడం ఎంతైనా అవశ్యం. అభ్యుదయ కవిత్వం సర్రియలిస్టు పద్ధతివల్ల (technicque) 'సంపన్నమైన'తీరూ, ఎక్కువగా కాకపోయినా కొద్దిగానైనా 'నష్టపోయిన'తీరూ చక్కగా వివేచనాపూర్వకంగా శ్రీశ్రీ కవిత్వాను ప్రసక్తంగా రెడ్డిగారుచూపడం ప్రయోజనకరంగా వుంటుంది. surrealist తదితర సాహిత్యరీతుల టెక్నిక్‌చేత socialist realism పరిపుష్టం అవుతుందంటూ కాడ్వెల్, తదితరుల అనవాయితీ మాటలకు వివరణం లభిస్తుందని ఆశ.

కాగా, "ఆరగోఁ సర్రియలిజం నుంచి అభ్యుదయ కవిత్వానికి ప్రయాణిస్తే, అభ్యుదయ కవిత్వంనుంచి సర్రియలిస్టు కవిత్వానికి శ్రీశ్రీ ప్రయాణించ"డం శ్రీశ్రీ దౌర్బల్యాన్ని తార్కాణించడం లేదా?

II

"ఇందులో రోజువారీరాజకీయ కూజితాల ఆధారంగా పరోత్తరగతిలో చేర్చాల్సిన గేయాలు దండిగా వున్నాయి" అన్నాను ఖడ్గసృష్టి సమీక్షలో.

రాజకీయ విషయం కవితావస్తువు కాజాలదన్నది నా అభిప్రాయమైనట్టు తేల్చుకొని సమీక్ష సమీక్షను వారి 'మనఃకార్తికలా'లో తయారుచేశారు. కాని, నా రేడియో సమీక్ష ఆదిలో శ్రీశ్రీ ప్రశస్తిని చెప్తూ...." ఇంకా ముఖ్యంగా రాజకీయం కూడా అయిన కవిత్వానికి తెలుగులో బాహాటంగా దారికల్పించినవాడు శ్రీశ్రీ" అన్నాను. మహాప్రస్థానంలో కవిత రాజకీయ విషయకం అయిందేగదా! అందులో గుణమున్నందున కళ్ళకద్దుకున్నాం. నేటి ఖడ్గసృష్టిలో అది లోపించింది. కవితా శంపాపర్తిభలు మిరుమిట్లు గొల్పక అవి రోజువారీ రాజకీయ కూజితాలుగానే వుండి పోయాయి.

ఏదికాదు కవితావస్తువు? రాజకీయం కాకపోవడమేమిటి? అయితే రాజకీయ వస్తువుతో కట్టిన పద్యంలో, గేయంలో, గేయవచనంలో కవిత తాండవించిందా లేదా? 'రసనిర్దేశం' అయిందా? 'శోభాలేశం' దొరుకుతోందా? అన్నది విచార్యం కావాలి. అంతే.

" విశాలాంధ్రలో ప్రజారాజ్యమే
ఘటించగా శ్రమించరా, పరాక్రమించరా!
నడూనడూ! భయం గియం విడూ!

వేగుచుక్క వెలిగె మింటిపై
వెలుగు రేఖలివిగో కంటివా? "
" మాట చేతగా మారి, మనిషి మనిషితో చేరి
స్వప్నం సత్యం ఐతేనే స్వర్గం."
" నిటారుగా నిలబడు నేస్తం
హాటా హాటిగా ముందుకి సాగు
హుషారుగా ముందుకు సాగు"
ఊరికే వెనక్కు చూస్తావేం
దుష్టిపి, కుక్క పీకావు........

అంటూ శ్రీశ్రీ అధోజగత్సహోదరులనే ఉద్దేశిస్తేనేం? ఈ 'షూశకేదారగౌళ అయిందా?' ఈ 'వూహ చాంపేయమాల,' 'రసరాజ్యడోల' అవుతోందా? sorry ! అందుకే ఇవంటే అంత కఠినంగా అన్నాను.

ఏది కవిత్వం? ఏది కాదు?

'విషాదాంధ్ర' అన్న గీతి ఈసపు నీతి కథ లాగున్నందుకు,

'గాంధీజీ' గేయం ఆర్షప్రోక్తం అనిపించుతున్నందుకు,

'మహా సంకల్పం' మహాప్రవక్తృవచోధార అవుతున్నందుకు— అందులో కవిత్వం ఉన్నదంటున్నారు రెడ్డిగారు.

కాని, ఈసపు నీతి కథ లాగుండటం, ప్రవక్తృవచోధార గావడం, ఆర్షప్రోక్త మనిపించడం—ఇవేమైనా కవితా లక్షణాలా? కవితా సంకేతాలా? సరిగ్గా ఈలక్షణాలే సంక్రమించకుండ జాగ్రత్తపడితేనే కవిత్వమనిపించుకొనేది. ఆ లక్షణగర్తలోపడితే మతబోధ, ఉపదేశం, విదురనీతిఫలం.

ఈ శీర్షికలనుండి కవితామయమైన పాదాలను ఉదాహరించారు. ఆ పట్టిక యిక్కడ యిస్తాను.

"సామూహికం స్వాతంత్ర్యం, అన్వేషించు అగత్యం"
"ఒంటరి తనం తుంటరి తనం
సామాజికంగా పెరుగుతుంది స్వేచ్ఛ—ఇది సత్యం"

'క్షేమం అవిభాజ్యం'
'పరమార్థం సామాజిక సామూహిక సద్వర్తన'
'స్వాతంత్ర్యం ఒక చాలా సున్నితమైన పుష్పం
చాలా వాడైనకత్తి, విశ్వమైన వజ్రం'
"అనేకం అయితే ఏకం, అదేవివేకం"
"అన్నీ ఒకడికి బదులు/అంతమందికీ అన్నీ/అదే స్వర్గమంటాను.

ఇత్యాది ప్రకటనలు, ఉద్ఘాటనలగూర్చి క్రిస్టోఫర్ కాడ్వెల్ చెప్పవలసివున్నాడు. కార్మికేతర, ఉన్నతవర్గాలనుండి తిరుగుబాటుదార్లు శ్రామిక వర్గానికై కలాన్ని ఝళిపించినప్పుడు:

"His proletarian living bursts into his art in the form of crude and grotesque scraps of Marxist phraseology and the mechanical application of the living proletarian theory"

"The progress of the socialist revolution hastens the assimilation of its bourgeois allies. Still the bourgeois conciousness 'drags' at the bourgeois revolutionary. It may act as a drag to hold back the artist from full ripening. The lives and works of yesseniu, Mayakovasky, pilnyak and yuryolesha are examples of the conflict involved in this inability to recast creatively in the categories of bourgeois art after revolution."

ఆడెన్, స్పెండర్, లీవిస్‌లు వ్రాసిన అభ్యుదయ కవిత్వానికీ యిదేబాధ. మయకోవస్కీ జీనియస్‌లోనూ యిదేలోపం. శ్రీశ్రీ లోనూ పై పంక్తులు ఆదే రూపిస్తున్నాయి. కాడ్వెల్ వర్గకవిత్వాన్నిగూర్చి ఏమివ్రాసినా, కవితాప్రమాణాల్ని మాత్రం వీసం తగ్గడానికి ఒప్పుకోలేదు. అదే అతనిలోని సుగుణం.

ఇక యీ శీర్షికలలోనే కవితరణిస్తున్న పంక్తులు లేకపోలేదు. కాకపోతే అవి రెడ్డిగారికి పై ప్రకటనలు, grotesque statements వలె అస్వాద్యం కాకపోయాయి. అందుచే ఉదాహృతాలు కాలేదు. ఇది కవితాభిరుచి, అనుభవంలోని తారతమ్యం అనుకోండి.

"మహారణ్యంలో మధ్యాహ్నంలాగ ఒకస్తబ్ధత, నిశ్శబ్దత"

"శిశువుకుదక్కని స్తన్యంలా గోదావరి నీళ్ళు"
"ఒక మేఘం గగనపథం దిగి మానవుడై నిలిచినట్లు"
"మాయమైన మహాసముద్రాలను
మరుభూమిలోని అడుగుజాడ స్మరిస్తున్నది"—
ఇంకా ఇలాంటి పంక్తుల్లోవుండిగాని కవిత్వం,
'అన్నీ ఒకరికి బదులు, అంతమందికీ అన్నీ, అదే స్వర్గం' అనడాల్లో వున్నదా?

వెంకటశాస్త్రీ, కిప్లింగ్, తుమ్మల సీతారామమూర్తి చౌదరీ, విట్మాన్‌లు రాజకీయ విషయాలమీద పద్యం, గేయం వ్రాయొచ్చు. ఇనాందారీ రద్దుచట్టంమీద చెళ్ళపిళ్ళవారి శాపనార్థపద్యాలు కవిత్వమనేదెవ్వరు? రాష్ట్రగానంపేర అంతా కవిత్వమవుతుందా? ఆంధ్రోద్యమగానంలో ఎందరెందరో వ్రాసిందంతా కవిత్వమేనా? వస్తుప్రాశస్త్యాన్ని, అప్రాశస్త్యాన్నిబట్టి కవిత్వం కావటం కాకపోవటం వుండదు. కవితగా దానిసత్తా అది అనుభూతిలోకి తేవాలి. కిప్లింగును బూర్జువా సాహిత్యకులైనా మహాకవి అన్నవారు లేరనుకొంటాను. స్మరిస్తే పద్యం, అరిస్తే వాద్యం అన్నవరుసలో ఆయన్ను Greatest Versifier అన్నంత మేరకైనా ఒక్క T. S. Eliot అన్నాడనుకొంటాను. కిప్లింగు 'Sons of Martha' ఒక్కసారి అభ్యుదయ కవితాభిజ్ఞులు చదువుకొంటూ, ఇలియట్ కొలగారం ఆలోచించడం మంచిదేమో! విట్మన్ కాటలాగ్ దృశ్యాలకేమిగాని, మున్సిపల్ మతారాజకీయాల్ని కవితాభృథస్నానం చేయించిన Y. B. Yeats తర్వాత ఇదొక చర్చాంశంకాదు.

III

ఇవాల్టికీ శ్రీశ్రీమీదా, శ్రీశ్రీఅన్నట్టు సైడుకట్లోకి వెళ్ళిపోయిన అభ్యుదయ కవిత్వంమీదా పడేవన్నీ పాతపడికట్టురాళ్ళేననే దుర్భ్రమావర్తంలో చిక్కి చీటికీ, మాటికీ భావకవిత్వపు ప్రేయసి పిల్లికళ్ళమీద గ్రుడ్లురమడం, వ్యాకరణపు లంబకర్ణాల మీద అవుట్లు పేల్చడం, ఛందఃకాందిశీక శిబిరాలమీద విరుచుకుపడడం వల్ల సాధిస్తున్నదేమీలేదు. ఇంకా పాతగొంతుకలకేనా సమాధానం చెప్పుకొనేది? వెనకైన వారికేనా తిరిగి వీరముద్రపట్టేది?

'ఖడ్గసృష్టి'చేసి తెలుగు'వాడి'కి అంకితమంటేనే 'సాధుసాధు' అని చెవులు మూసుకొనే మర్యాదస్తులకా మేల్కొంటున్న 'యోనిద్వారం' ఔచిత్యాన్ని క్వాచిత్కంగా

ధ్వనిమత ప్రవచనం చెయ్యవలసింది? శారదా మాతను ఉద్దేశిస్తూ కాటుకకంటి నీరు చిందిపడే చనుకట్టును చూచినందుకేనా ఛాందసుల్ని ఎగతాళిచేశాం? అదిమనకు వర్తించదా? 'యోని ద్వారం' మేలుకొంటోందే చూడలేక మొహం మళ్ళించుకొనే మర్యాదస్తులు 'ధూర్త లోకపు దొంగలంజాకొడుకులకు' జడుసుకోక నిర్ధారించుకొన్న వారేనని తెలిసి మాట్లాడుకోవడం తగును. సంస్కృతీ స్తన్యంచేపి మాతృస్థానకం అవుతుందని ధ్వనించడానికి మేల్కొనే యోని ద్వారం బయస్కోపు బొమ్మను మనఃకాండపటం ఎక్కించకగాని వదలదన్నమాట. ఇక్కడ పేచీ మాతృత్వపు పావిత్ర్యాన్ని యోని imagery భంగిస్తోంది. యోని శబ్దం ప్రయోగించినంత మాత్రానికే 'ఛాందసుడు' సాధు సాధు అనుకోనవసరంలేదు. ఆతడు 'శాస్త్ర యోనిత్వాత్' అని చదువుకొన్నాడు. 'యోని'కి కారణార్థం చెప్పుకొన్నాడు; 'జాతి' అర్థం చెప్పుకొన్నాడు. Imagery మీద కన్నుగలిగిన అభిరుచి వైశద్యం వున్న నవీనుడే దీనికి అప్పలి మొగం చేసుకొంటాడు.

అలాగే Pentagon ను పెంటగనులు చేసినందుకు ఎవ్వరూ "నోరునొక్కు"కోలేదు. అక్కడ అశ్లీలం సమస్యగా ప్రాయలేదు. ప్రాచీనుల్ని వెక్కిరించే శ్రీశ్రీ అనుప్రాసావ్యసనానికి దాసుడ ఎలాగయ్యాడో చూపుతూ,

"పెంటగనుల తుంటవులను పెంటబెట్టుకొనివస్తే
జాకెట్లను విసురుతాం, నీకట్లనువిప్పుతాం,
జాకెట్లను నవరించి, పాకెట్లను సరిదిద్ది" అన్నపంక్తుల్ని ఉదాహరించాను. కాని

Pentagon ను పెంటగనును చేసినదాన్లో అశ్లీలానికి గాదు 'నోరునొక్కుకున్నది'— ఎబ్బెట్టుగా కృతకంగా పులుముడుతో అనుప్రాసకు తంటాలుపడడానికి మూసుకొన్నాం. 'నాజూకు తెలిసిన నవీన నాగరిక లలన ముక్తసరి ముప్పేటహారాలు"గా లేనందుకు నోరు నొక్కుకుంటున్నాం. విషయాన్ని విషయంగా తెల్పుకోవటం కావాలిగాని, ఒకదాన్ని ఇంకోటిగాచెప్పుకొని ఛాయాసమాధానాలు చేసి ప్రయోజనం లేదు.

మయకోవస్కీకన్న శ్రీశ్రీ అధికంగా సాధించాడంటే సంతోషించేవాణ్నే. అది కాదుగదా పేచీ. లెనిన్ ఘనత, మాన్యత ఏమో బాగాతెలిసినవాణ్ణని నామీద నాకు నమ్మకం యిప్పటికీ వదల్లేదు. అట్టినాకు మయకోవస్కీ

"లెనిన్ పేడి లెనిన్ వాడి జగంనాడిధమని
లెనిన్ లెనిన్ లెనిన్ లెనిన్ లెనిన్ మన ప్రమాణం
లెనిన్ లో స్నానంచేసి పునీతుణ్ణవుతున్నాను" అని వినగానే,

'రాముడు నాకు స్నానము రాముడు నాకు జపంబు ఇంకాయింకా పద్యం గుర్తుకొచ్చేసింది. లెనిన్ మళ్ళీ ఒకకొత్త విగ్రహం కాకుండా, లెనిన్ ప్రశస్తిని రామభజనకి ఉజ్జీ కానివ్వకుండ కాపాడుకోవాలంటూ, మయకోవస్కీని గూర్చి క్రిష్టోఫర్ కాడ్వెల్ అంచనాను గుర్తుచేసుకొంటూ వుంటాను.

కెన్నెడీ అభిశంసన రెడ్డిగారికీ గొప్ప ఖండిక అనిపించకపోయినా, సామ్రాజ్య వాదాభిశంసనగా జరుగవలసిందేనంటున్నారు. ఒక దుష్టవ్యవస్థకు ఒక దుష్టవ్యక్తిని ప్రతీకగా చేయొచ్చు. కాని కెన్నెడీ ఆ దుష్టవ్యవస్థకు ప్రతీకాప్రాయుడై దుష్టుడు దంటాను. అమెరికన్ రాజకీయాల్లో డేగల్లోవాడుకాడు, పావురాల్లోవాడు; ప్రచ్ఛన్న యుద్ధంలో సడలింపుకు ఆరంభకుడు; పదవి దిగుతూ ఏవో వృద్ధనారీ వాక్యాలు చెప్పిన ఐసెన్‌హోవర్ ప్రభావంలోపడే చేసిన Bay of pigs దాడికి పొరపడ్డాననుకొన్నవాడు; దేశాలమధ్య ఎగుమతి దిగుమతి సుంకాల సడలింపులతన పేర జరిగించాలని ప్రపంచం అనుకొన్నవాడు (kennedy Roundof talks)అమెరికన్ సామ్రాజ్యవాద దౌష్ట్యానికి ప్రతినిధినిచేసి శపించడం ఔచిత్యం కాదంటాను. యుద్ధానంతర ప్రెసిడెంట్లకెల్లా ఉదారుడు అతడు. సత్రియలిజంలోనూ సుగుణం చూస్తానన్న గుణగ్రహణైకబుద్ధి యిక్కడా ప్రసరించవలసే వుంటుందంటాను.

ప్రతి కవికీ వృద్ధిక్షయాలుంటాయి! శ్రీశ్రీ నిత్యహరిత వృక్షం! వివర్ధనమే వృక్షస్వభావమైతే, 'మహాప్రస్థానం' శ్రీశ్రీ కవితా వసంతం 'ఖడ్గసృష్టి' శ్రీశ్రీ కవితా హేమంతం! (యీ హేమంతంలో) ఫలరాశి ఎక్కువగా దర్శనమిస్తుంది. ఇది క్షయమనుకొంటే ఎట్లా? వృద్ధిని క్షయమని పొరబడితే వచ్చేఅనర్థమే యీ విమర్శకుల చిత్తవృత్తిలో కనిపిస్తున్నది"

—రమణారెడ్డిగారు.

ఇందులో పూర్వాపర సుసంగతత్వం 'దేవునికి' వదిలివేద్దాం. ఇంతకూ వసంతంకన్న హేమంతం అభివృద్ధి!! హేమంతమంటే వీరేమని టిప్పీక చేసినా, హేమంతం శైథిల్యానికీ, క్షయానికీ సంజ్ఞ— కాదంటే శ్రీశ్రీనే అడుగుదాం, పదండి:

వాసంతసమీరం నీవై
హేమంతతుషారం నేనై

ఇంకేముంది? ఖడ్గసృష్టి శ్రీశ్రీ కవితా హేమంతమనే మాటైతే— 'ఖడ్గసృష్టి' శ్రీశ్రీ శైథిల్యం.

అనుకొన్నట్లు అతికేట్టుగా సందర్భానికి ఒక్క ఉపమానం Handle చెయ్య లేక తికమకపడుతూ, "కవిత్వమంటే ఏమిటో విమర్శకునికంటే కవే సాధికారికంగా చెప్పగలడు" అంటున్న (శాండ్ బార్గుకాదు) రెడ్డిగారు ఆధునిక కవిత్వాన్నిగూర్చి 'సాధికారంగా' చెప్పేవిషయం తప్పక చూడవలసివుంది.

"అలంకారాలు, చమత్కారాలు, వ్యంగ్యంధ్వని— ఇవి వుంటేనే కవిత్వం, కాకుంటే కాదు, అని ఏశాసనాన్నీ నవీనకవులు తలదాల్చరు. నవ్యకవులే ఆ శాసనాలను ఉల్లంఘించారు"— రెడ్డిగారు.

ఆలంకారికార్థంలో కనీసం చమత్కారంలేకుండ కవిత్వం అవుతుందంటే తల గలిగిన ఏనవీనుడూ అంగీకరిస్తాడనుకోను. నేటి వాడుకలోవున్న అర్థంలో "ఆధునిక కవిత్వంలో చమత్కారం దశమరసంగా భాసిస్తోందని" కుందుర్తి వాపోయే వున్నాడు. రసపర్యవసాయి కాకపోయినా యత్కించిచ్చమత్కారం అనుభూయమానం అవుతోన్నదాన్ని కవితా శబ్దవాచ్యం చేద్దామన్నారు ఉదారంగా పూర్వులే. అదీలేకుండా కవిత్వం అనమంటారు రెడ్డిగారు. ఇంక కవిత కానిదేదో?

చటులాలంకారపు మటుమాయల నటనలలో కవితారూపం కనరాకేదనడానికి ఆద్యులు నవ్యకవులుకారు; ప్రాచీనులే— లాక్షణికులే— ధ్వనికారులు, ఇతరులు నిరలంకారంగా ఉత్తమోత్తమ కవిత్వం ఇదిగో అని వార్కాణించారు వెనకటికేవారు. అలంకారం మీద తిరుగుబాటుకు నేటివారెవ్వరూ credit తీసుకోనవసరంలేదు. పైగా, అలంకారపు కలంకారీ అద్దకం నేడు మానుకోనూలేదు.

ఇక ధ్వని శాసనోల్లంఘనం ఘనం ఏమీకాదు. 'నీకై ఏరినవేయే ధ్వనులో' అన్న శ్రీ శ్రీ కొంతగానైనా ధ్వనిని సాధించినవాడు. చాలగాని తనమంతాధ్వనిశాసనోల్లంఘనమే. తత్ఫలం వాచ్యం, వాచ్యం వ్యంగ్యంకన్న ప్రశస్తమని అనుభూతిచెప్పదు. ఆవేశంలో తప్పితే ఆలోచిస్తే వీరూ చెప్పలేరు.

వస్తువులో, భాషలో, ఛందంలో, ఇమేజరీలో, వ్యాకరణ విషయంలో ఆధునికులు మార్పు చూపించారు. ఇంకేమేనావుంటే నెమ్మదిగా యోచించి కేటలాగ్‌చేదాం కాని

"క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం బ్రహ్మానుభవం" కవితా లక్ష్యంగా, రసానుభూతి, తదుపకరణంగా 'ధ్వని'లేకుండా కవిత అసూహ్యం.

★

సమీక్ష :

చేతనావర్తం

రెండు భిన్న భావకూటాలకూ, భిన్న సంప్రదాయాలకూ, చెందిన నలుగురు కవుల వచన కవితల సంకలనమిది. స్వీకరించిన వస్తువునుబట్టీ, నిర్వహించిన శైలినిబట్టీ, చేరదలుచుకొన్న గమ్యాన్ననుసరించీ, ఈ కవుల మార్గాలు వేరు.

ఇందులో శ్రీ సుప్రసన్న, శ్రీ సంపత్కుమార గారలు ఒకవైపునా, శ్రీ వే. నరసింహారెడ్డి, శ్రీ పేర్వారం జగన్నాథం గారలు మరొకదిక్కునా, చూపు నిలిపినవాళ్ళు. వచనకవితా ప్రక్రియను చేపట్టడమొక్కటే ఈ కవివర్గాలకు ఉభయ సాధారణ ధర్మం.

'అవిద్యా' మూలకాలైన ఈ సంసార బంధాల నుండి విడివడి 'జీవుడు' శ్రీ శంకరులవారి 'మాయావాదం' ప్రకారం, అన్నమయప్రాణమయాది పంచకోశాలనే మాయావరణాలను దాటి 'నిర్వికల్ప'మైన చిచ్ఛక్తితో తాదాత్మ్యాన్ని పొందగోరే 'ముముక్షువులు' ఒకరూ; "ఈ కనలుతూ ఉండే వాస్తవాలను" ఎదిరించి, నిలిచి, నిజంగా పోరాడాలనే యథార్థవాదులు మరొకరూ.

శ్రీ సుప్రసన్న: సంపాదకులు శ్రీ సుప్రసన్నగారి కవితలో, "మనోమయ కోశంలోని మనుష్యుడు దివ్యత్వాన్ని అధిరోహించడం ప్రతీకాత్మకంగా చెప్పబడ్డదనీ, "అందులో, వేదాంత, తాంత్రిక మనస్తత్వశాస్త్ర విషయాలు సమన్వితనిపొందా"యనీ చెప్పారు. జీవుడు, మాయావరణాల నతిక్రమించిన శుద్ధసచ్చిదానంద స్వరూపమైన చిచ్ఛక్తితో సంయోగాన్ని పొంది 'ముక్తాత్మ' కావడాన్ని రూపకోపమాన ప్రతీకల సాయంతో కవితగా మలచాలని ప్రయత్నించారు—శ్రీ సుప్రసన్నగారిందులో. ఈ రూపక ప్రతీకలసాయంతో 'ముముక్షుమార్గాన్ని, అంతిమవిజయాన్ని' కథగా, కవితగా నాటకంగా మలచడంలో, అటు ఆంగ్లంలో జాన్ బనియన్, ఇటు భారతీయసాహిత్యంలో ప్రబోధ చంద్రోదయ కారుడూ. ఇంకా అనేకులు త్రొక్కిన నలిగినబాటలో పయనించేవారి సరికొత్త వారసుడుగా శ్రీ సుప్రసన్న సాక్షాత్కరిస్తారు.

వారు స్వీకరించిన వస్తువులోని ముడిపదార్థాలు మూడున్నూ "శాస్త్రాలే." శాస్త్రానికి ఛందో రూపమిచ్చినంతమాత్రాన "కాలామృతం" కవిత్వం కానట్టే శాస్త్రవస్తువుకు వచన కవితా రూపమిచ్చినంతమాత్రాన కవితా గౌరవం లభింపదు. శాస్త్రాన్ని వస్తువుగా స్వీకరింపరాదని కాదు—కవితా "దినుసు" అనే కొత్త పదార్థం చేరనిదే–చేరి ఈ ముడిపదార్థాల స్వరూపాన్ని మార్చనిదే, కేవలం వస్తుగౌరవాన్నిబట్టి కవితా ఘనత దక్కదు. అనిమాత్రమే. కవితకు శాస్త్రవస్తువును స్వీకరించడం సాహసంతోకూడినపని. ఆ కైలాసాన్ని రావణబ్రహ్మవంటివాడు చేపట్టినా చెప్పలేము.

మూడు శాస్త్రాలు సమన్వితిని పొందాయని పరిచయంచేసిన శ్రీసుప్రసన్నగారి రచనలో, కవితా 'దినుసు' మాత్రం తీర్థానికి తీర్థంగా ప్రసాదానికి ప్రసాదంగా, అక్కడక్కడా విడివిడి పదబంధాలలోనూ, ఎక్కడో ఒక్క "అమృతపుత్రులు" వంటి చక్కని రచనలోనూ తప్ప అస్పష్టప్రతీకల అయోమయ బాహుబంధంలో గింజుకొంటున్నది. అక్కడక్కడా అంత్య ప్రాసలు, ఎక్కడికక్కడ దోవతప్ప గొట్టుకోవడానికనుకూలమైన మలుపులు, తెలుగు పదాలలోంచి సంస్కృత పదాలలోకి దూకులు విరివై, వచన కవితకు భావోన్ముఖమైన రూపమిచ్చే ప్రవాహ గుణంగానీ, ఎక్కడికక్కడ గుండెలాకట్టుకునే చమత్కారంగాని కానరాక వచనం కత్తిరించిన తుంటలుగా సాగింపీరచన. కాని ఇందులో చాలాసుగుణాలుకలిగి, చదవగానే తల ఊపించేది "అమృత పుత్రులు."

"బింబ సంయోజనలో వైవిధ్యం" అని వారు పెద్దపేరు పెట్టుకొన్న ఒకదానికొకటి సరిగా అతకని కట్లుతెగిన ఊహల మాసికలు మాత్రం మెండు. ఒయాసిస్సులాంటి ఒక "అమృత పుత్రులు"న్నా మొత్తం మీద శ్రీ సుప్రసన్నగారు తమ కవితాకన్యకెత్తిన వేదాంత సుధాకలశం ఆవిడ నడుములు అకాలంలో కుంగదీశాయనే చెప్పాలి. ఈ వేదాంతకవితవల్ల రసానుభవం మాట అటుంచి, ప్రయోజనం మాట తలపెట్టినా,

" ఈ తెలివిగలిగి యఖండ నిర్వృతింగాంచి సుఖించు పరమయోగికి బహుక్లేశదంబులగు చదువులంటసియేమి? అటుగాక చదువదొరకొనిన నరునకు, కాలంబు నాలంబు ......అందులకు సామాగ్రి గిటగిటన, కొంతెరుంగనగు పదంబు పుటపుటన ...... సముత్పన్నజ్ఞానుండై త్రైగుణ్య విషయంబులగువానిని, అనీత ధాన్యంబు నిష్ఫలంబైన పలాలంబును, అర్థిమథుండు సిక్థకంబును విడుచు వడువున

విడువవలయును ... . పరమేకాంగినైననాకు మొదలనివి యధిగమింపందుద విసర్జింపనేమి ప్రయోజనంబు అన్న విష్ణుచిత్తుని వాక్యములు తలపుకు రాకమానవు. వీరిజటిల వేదాంతకవిత సామాన్యునికర్థంకాదు, పరమయోగికి అవసరంలేదు.[2] శాస్త్రవేత్త అయిన సహృదయునికి శ్రమ తప్ప మరేమీ మిగల్చదు. ముముక్షువులు ఎవరైనాఉంటే అసలే బహుకష్టమైన ('శాస్త్రజ్ఞానం బహుక్లిష్టం బుద్ధేశ్చలన కారణం') ఈ వేదాంతానికి, స్పష్టమయిన వివరణాత్మకమయిన ఏభాష్యాన్నో ఆశ్రయింపక, విషయక్లిష్టతకు దోడు ప్రతీకజటిలం కూడా అయిన ఈ కవిత నాశ్రయిస్తారనుకోవడం ఎవరికైనా ఆశావాదానికి పరాకాష్ఠగానే అనిపిస్తుంది. వచన కవితా రూపమెత్తినవారి వేదాంతకవితావనిత తాను కాపు రూపధారినన్న విషయం రుజువుచేసుకుంటుందేమో గానీ (ఈ కవులు) "కావాలని వచనకవితా ప్రక్రియయే పరమార్థమన్న ఊహకల వాళ్ళుకారు—..." ఈ కావ్యంలో విషయ వివేచన...బౌద్ధిక ప్రాధాన్యం కలది కావడంవల్ల ...పద్యమూ, గద్యమూకాక వచన పద్యం స్వీకృతమయింది.) నిసర్గ భావనాసుందరియైన నవ్యకవితా నవోఢగా మాత్రం స్పృహణీయ కాలేదు.

<u>శ్రీ సంపత్కుమార:</u> శ్రీ సంపత్కుమారగారి కవితావృక్షానికి కొమ్మలు గాలిలోఉన్నా వేరు వేదాంతంలోనే ఉంది. 'అంతర్లయ' 'మనశ్చిత్రం' 'ద్వైవిధ్యం' వంటి రచనల్లో వేదాంతభావన 'రోజువారీ' 'గృహ ప్రవేశం' మొదలయినవాటిల్లో వ్యక్తిగతమయిన సమాజగతమయిన యథార్థభావనా, రెండూఉన్నాయి. కాని, పృథివ్యాపస్తేజో వాయురాకాశాలనే పంచభూతాలనూ పేరుపేరునా పిలిచి 'నీ గుణాన్ని ఇంచు' 'నీ మాలిన్యాన్ని పరిహరించు' అనివేడుకొని,

"నన్ను నే బాగా పరీక్షించుకొని,
నేను కానిదాన్ని దులుపుకొని,
నన్ను నాలో లయంకానీయండి" అనడంలో, వీరి మూలతత్వం ద్యోతకమవుతుంది. లోకవిమర్శ ఎంతఉన్నా, దృష్టిమాత్రం వేదాంతులు నిర్దేశించిన

(1) ఆముక్తమాల్యద: చూడు (2) కూడా

(2) 'విద్యారణ్య' వేదాంత పంచదశి: 4-45 నుండి 48.

"గ్రంథమభ్యస్య మేధావీ జ్ఞాన విజ్ఞాన తత్పరః
పలాల మివ ధాన్యార్థీ త్యజేత్ గ్రంథ మశేషతః" —46.
"నాను ధ్యాయేత్ బహూన్ శబ్దాన్ వాచోవిగ్లాపనం హితత్" —47.

'నిర్లిప్తత' వైపే ఉండడంవల్ల ('లక్ష్యమనే దెందుకుసఖీ, అది ఉంటే మనమిల్లా ఉండం గమ్యహీనయాత్రాగతభావం కృత్రిమమయితేనేం అది మాత్రమె ఆనందాభాసం కాదా') వీరు దృష్టిలో సమైక్యం కుదుర్చుకుంటేనేగానీ కవితా భావనలోనూ సమైక్యం కుదరదని భావించవలసివస్తున్నది. నిర్లిప్తతవైపు స్పష్టమైన నిర్దేశం కన్పిస్తున్నది. "అందుకోసమని సకియా, మన మలిపులం కావలసేఉన్నది'' 'మబ్బు' "ఈ రాత్రి గడుపలేను'' అన్న రచనలు కవి భావనాబలానికి, నిర్వహణశిల్పానికీ చక్కని ఉదాహరణలు. సంపాదకులు శ్రీ సంపత్కుమారను పరిచయంచేస్తూ 'ఛందో రహస్య వేది కావడంవల్ల వీనిలోనూ ఎన్నో ప్రయోగాలు చేసినట్టు గోచరిస్తుంది' అన్నారు కానీ, అలాంటి వేమీ ఇందులో కానరావు.

శ్రీ పేర్వారం జగన్నాథం: వీరి రచనలో దాదాపు ఖండికలన్నీ సమాజం కుళ్ళును కడగడానికి ఉద్దేశించిన వ్యంగ్యరచనలు. "ది గ్రేట్ ఇండియన్ సర్కస్" దిగంబర కవులపై వ్యంగ్యబాణంగా విసిరిన "యదా యదాహిధర్మస్య గ్లానిర్భవతి భారత" అన్న ఖండికలు రచయిత హాస్యవ్యంగ్యధోరణులకు మచ్చుతునకలు. కాని,

"దిగంబర మహామానవుడు
దిగుతున్నాడు అర్ధరాత్రి
నోళ్ళు మూయండి, కళ్ళు తెరవండి

మళ్ళీ మళ్ళీ దర్శనం చేసుకోండి" అన్న వాక్యాల్లో తొంగిచూచే అశ్లీలత వ్యంగ్యరచయితకు ముఖ్యంగా ఉండవలసిన సంయమనాన్నే కాక ఎదుటివారి అభిప్రాయాన్ని ఉదారంగా పరిశీలింపవలసిన సానుభూతి లోపాన్నికూడా రచ్చకీడ్చి యీరచయిత జాగ్రత్తలోని త్రుటులను ఎత్తిచూపిస్తున్నాయి. సంపాదకులు చెప్పినట్లు 'కార్టూను కవిత' అన్న లక్షణంఎక్కువ. 'స్వామీ' అన్న ఒకే సంబోధన అన్ని ఖండికలకూ ముందుండడంవల్ల వైవిధ్యంలో ఒక విధమైన వెలితికనబడుతున్నది. 'అయినవాన్ని, కానివాన్ని యమున్ని, కాలాంతకున్ని' వంటి ప్రయోగాలు ఆ సందర్భంలో కొంత ఎబ్బెట్టుగా ఉన్నాయి. అందరూ వాడినట్లు 'వాణ్ణి' అనివుంటే బాగుండును.

శ్రీ నరసింహారెడ్డి: ఈ సంపుటిలోని కవుల్లో భావనలోనూ, ప్రకటనలోనూ కవితాత్మ కొంచెమెక్కువగా కలవాడు శ్రీ వే. నరసింహారెడ్డి. "కుహనా సంస్కారాలనుండి

కృత్రిమతనుండి'' బయటపడి 'విశ్వశ్రేయం కోసం' సమతా సౌందర్యం కోసం సాగించిన రచనయిది.

'జన్మాష్టమి' 'రఫ్‌స్కెచ్' మంచిరచనలు.

"ఈపాడే రేడియో పాట గొంతునొక్కేమీట మరోచోట" అన్నప్పుడూ, మంత్రులు, నాయకులను గురించి

"ఈ మాయలమరాఠీల ప్రాణాల చిలుకలు పారావారాల కావల" అన్నప్పుడూ అందులోని 'ధ్వని' ఆకర్షిస్తుంది. పరిచయ కర్తగారన్నట్లు ఈయనలో 'తీవ్రమైన ఆవేశం' కాక చాలాచోట్ల సంయమనంగల ఆవేశం. సలక్షణంగా ప్రస్ఫుట మవుతున్నది. 'ప్రేమించినవానివి' చూసినవానివి' వంటి ప్రయోగాలుకాక 'వాడివి' అనివాటి ఉన్నట్లయితే మరికొంచెం అందంవచ్చేది. మొత్తంమీద సంపాదకులన్నట్టు, "మానవుడు ఉన్నత దివ్యజీవన శిఖరాలమీదకు అధిరోహించడాన్ని చిత్రించే"మాట ఎలావున్నా ఈ కవిత సమాజంలోని 'కుళ్ళు'ను కడిగి 'కళ్యాణం'వైపు వేలెత్తి చూపుతున్నది. శ్రీ సుప్రసన్నగారన్నట్లు "ఈ కవులందరినీ" కాకపోయినా, కొందరినైనా ఆధునిక భావచేతన ఏకీకృతం చేస్తున్నదని అంగీకరించవచ్చు.

II

ఇటు కేవల కవిపరిచయాత్మకమైన భూమికా కాక, అటు ఆధునిక కవితా పరిణామంపై ఒక ప్రత్యేక వ్యాసమూ కాక, ఈ రెండూ కలిసిన భూమిక అన్నపేరున శ్రీ సుప్రసన్నగారు దాదాపు 18 పేజీల వ్యాసాన్ని ప్రకటించారు — ఈ కవితా సంకలనం చివర.

ఇందులో వారు ఆధ్యాత్మిక దృష్టితో కవితా నిర్వచనంతో ప్రారంభించి ఆధునికతనూ, పాశ్చాత్యదేశాల్లో ఆధునిక కవితా పరిణామాన్నీదాని లక్షణాలనూ, తెలుగులో ఆధునిక కవితా చరిత్రనూ స్థూలంగా చర్చించారు.

వేదాంత పరిభాషాజటిలమై, కేవల కవితాభిరుచికలిగిన సహృదయునికి కష్టంమీదగానీ అర్థంకాని, ఈ వ్యాసంలో, నేటిమానవుని స్థితినీ, కవిత్వాన్నీవారు, ఆధ్యాత్మిక దృష్టితో వ్యాఖ్యానించారు.

ఆధునిక మానవుని మనస్సులోని అశాంతినీ కల్లోలాన్నీ వారు 'జీవునివేదన' గానూ, అతడు తపించే సంఘర్షణాతీతమైన 'ప్రశాంతిని' ముముక్షువు కోరే ముక్తస్థితి గానూ వారు దర్శిస్తున్నారనిపిస్తుంది.

"జగచ్చైతన్యం ఈ సంధిదశలో కల్లోలితమై తనలోతానే సుడులు పడుతున్నది ... జడ ప్రాణదశలనుండి ఊర్ధ్వముఖముగా అధిరోహించే యీచైతన్యము, మనోమయదశయందు ఊర్ధ్వముఖీనమైన 'అతీతమనస్సు'ను ఇక్కడికి అవతరింప జేయకుతూహల పడుతున్నది."

"ఈ ఆరోహణ శీలమైన చైతన్య ప్రవృత్తి నరుడికి అనిర్వచనీయమయిన వేదనకు కారణమౌతున్నది. యీ జీవునివేదన ......"

"మనోమయ దశకు పూర్వమందున్న అన్నమయ ప్రాణమయకోశాలు ఐహిక వృత్తులనే నీలినీడలు ప్రసరింపజేయగా పరమందున్న విజ్ఞానమయ ఆనందమయ కోశాలు ఆనందలోకపు విద్యుద్వల్లీద్యుతులు ప్రతిఫలింపజేయగా ఈ చేతనసరస్సు చిచ్ఛక్తి పరిణామానికి ఒక దర్పణంగా ఉన్నది."

పైన ఉదహరించిన శ్రీసుప్రసన్నగారి వాక్యాలనుబట్టి, ఆధునిక మానవుని జీవన కల్లోలం వేదాంతుల 'జీవునివేదన'గా, ఇప్పటివారు పొందదలచుకొన్న శాంతియుత జీవనం ముక్తుని స్థితిగానూ వారుభావిస్తున్నారనిస్ఫురిస్తుంది. కాని వ్యాసం చివరిభాగం లో వారు మరొకమాట అన్నారు. "మానవ జీవితం ఐహికలోకం, భావలోకం, ఆధ్యాత్మలోకం, అని మూడు విధాలుగా విభజించవచ్చు. సమగ్రమైన మానవ వికాసానికి అన్నిరంగాల సమన్వితమయిన వికాసం అవసరం. పాక్షిక దృష్టి అభివృద్ధి హేతుకం కాదు". పైవాక్యాలనూ, వెనకటి వాక్యాలనూ సమన్వయించుకొంటే వారు కేవలం ఆధ్యాత్మిక దృష్టికలవారుకారనీ ఐహిక కల్యాణంకూడా కోరుతున్నారనీ బోధపడుతుంది. కాని, వారుచెప్పిన ప్రకారం, ఆధ్యాత్మదృష్టిని ఐహికలోకంతో సమన్వయం చేయడానికి వారు చాలావరకు స్పష్టంగానే ప్రతిపాదించే సిద్ధాంతం అద్వైత సిద్ధాంతానుసారంగా, జీవుడు మాయదాటి చిచ్ఛక్తిలో లీనంకావడము కాక జీవుడు కొంచెమెదిగి, చిచ్ఛక్తి కొంచెందిగి— ఈ రెంటి యొక్క సమన్వయంగా అర్థం చేసికోవలసి వున్నది. ఐహిక కల్లోలాలకు లేదా 'వేదన'లకు వారుసూచించే పరిష్కారమార్గం వాటిని నిజంగా ఎదుర్కొనడంకాక వాటిపట్ల ఒక నిస్సంగత్వాన్ని (Detachment)

పెంపొందించుకోవడంగా[3] గోచరిస్తున్నది. ప్రపంచాన్నీ, దాని సమస్యలనూ నిజంగా గుర్తింపనినాడు ఐహికమయిన భౌతిక దృక్పథం పరిపూర్ణం కాజాలదు. "నళినీదళగత జలబిందువు" లాంటి వైఖరి వేదాంతులవైఖరే, కాగా, "జీవుడుకొంచె మెదిగి చిచ్ఛక్తి కొంచెందిగి ఈ రెంటి యొక్క సమన్వయం అద్వైత సిద్ధాంతముకాదు. ద్వైతము కాదు. ఇది వారి స్వీయ సిద్ధాంతమో శ్రీఅరవిందులవారి "దైవీశక్తి పరిణతమయిన మానుషచైతన్య క్షేత్రంలోనికి ఇహలోకంలోనే అవతరించే" సిద్ధాంతమో లేక విశిష్టాద్వైతుల సిద్ధాంతమోఅయి ఉన్నది. కొంచెం నిదానించి చూస్తే వారిందులో (అద్వైత, విశిష్టాద్వైత అరవింద) ఏసిద్ధాంతాన్నీ సమగ్రంగా స్వీకరించలేదనీ, వారుప్రతిపాదించే సిద్ధాంతం అన్నిసిద్ధాంతాల సమన్వితరూపమనీ తెలుస్తుంది. మొత్తం మీద వీరి సిద్ధాంతం విశిష్టాద్వైతానికి చాలా చేరువగాఉన్నది. ఆచార్యులవారు విశిష్టాద్వైతానికి కొంచెంమాయపూసి, అందిస్తున్నారు. ఒకదాన్ని ఒకటి అంగీకరింపని పైమూడు సిద్ధాంతాలనూ కలగా పులగంగా[4] కలిపివేసిన అధునాతనమైన ఈ సిద్ధాంతం ఎంతమందికి అంగీకారయోగ్యం అన్నవిషయంమీద వీరిదృష్టి పాక్షికమువునా కాదా అన్నది ఆధారపడివుంటుంది. 'పాక్షికదృష్టి' వారుచెప్పినట్లు 'అభివృద్ధి హేతుకంకాదు.' ఇదికాక ఆధ్యాత్మికైహిక దృష్టుల సమన్వయానికి వీరుగుకొకమార్గమేదైనా సూచించి వుంటే అది ఇందులో మాత్రం కానరావడం లేదు.

---

(3) " The Mumukshu is interested more in shedding worldliness in better earnest than in escaping from the World''.
'Visistadvaitha' P. N. Srinivasachary.

(4) విశిష్టాద్వైతులు మాయావాదాన్ని అంగీకరింపరు. జగత్తువారికి సత్యము. అద్వైతుల 'మిథ్య' రాధాకృష్ణ (సర్వేపల్లి) గారన్నట్లు 'non existent' కాదనుకోండి. అద్వైతుల పంచకోశాలనూ, ఒకసారి విశిష్టాద్వైతుల 'నవావరణ' లను(The nine steps to salvation)ఉటంకించినందువల్ల శ్రీ సుప్రసన్న గారు దేన్ననుసరిస్తున్నారో గోచరంకాదు.

"అన్వయ వ్యతిరేకాభ్యాం పంచకోశ వివేకతః స్వాత్మానాం తతఉద్ధృత్య పరబ్రహ్మప్రపద్యతే" అన్న (వేదాంత పంచదశి-1-37) అన్ని అద్వైతుల పంచకోశములకూ, విశిష్టాద్వైతుల 'వివేకం, నిర్వేదం విరక్తి, భీతిభావం ఉపాయం'' అన్నమొదటి సోపానపంచకానికి సంబంధం కుదరడం లేదు.

శ్రీ సుప్రసన్నగారు ఈ వ్యాసంలో 'సహృదయుల'కిచ్చిన నిర్వచనం మాత్రం ప్రశంసాపాత్రం. 'జీవులలో ఉన్నతులయినవారు, రసాస్వాదవేళ వ్యక్తిత్వపు సరిహద్దులు దాటగలవారు సహృదయులు.'

'ఆధునికత' అనేది కేవలం కాలసంబంధాననే స్థాపించేట్లయితే 'అది ఆ కాలసీమదాటగానే ప్రాచీనమే అవుతుంది' అనీ, 'కానీ, తాత్త్వికంగా ఈఆధునికత్వం ఏదైనా ఉంటే దానికీ ఆధునికత్వం ఎల్లకాలమూ ఉండవచ్చు' అనీ వారంటారు. 'ఆధునికత'ను నిర్వచిస్తూ సమసామయికమైన సమాజగతికి అతీతంగా ఉన్నతంగా ఆలోచించి, నూతన మార్గాన తొక్కిన ప్రతిసన్నివేశమూ ఆధునికమేననీ' వారన్నారు. కానీ, 'ఆధునికత' అనేది కాలంతో పరస్పర సాపేక్షమయిన విషయం. ఒకనాటికి ఆధునికమయినది మరొకనాటికి ప్రాచీనం కావచ్చు. ఏకాలానికి ఆధునికత అనేది (సాహిత్యం నవనవోన్మేషం, పరిణామశీలం కాబట్టి) సరైనప్రశ్న. వారే, తర్వాత, "ఆధునికత భూతకాల భావచైతన్యానికి భిన్నమైంది కాదు. ఇదిదాని పరిణామమే" అన్నారు. ఈ వాక్యమూ, పైనచెప్పిన 'తాత్త్వికంగా ఆధునికత ఏదైనా ఉండేట్లయితే దానికీ ఆధునికత ఎల్లకాలమూ ఉండవచ్చు' అన్నవాక్యమూ పరస్పర విరుద్ధార్థాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ఆధునికత అనేది కాలసీమలనడుమ స్థాపింపవలసిన విషయమే.

తెలుగులో నూతన కవితావిర్భావాన్ని గురించి చెపుతూ, వారొక చిత్రమైన మాట అన్నారు. "మహాకావ్యాల సంస్కారం, భావకవితావేశమూ, ప్రగతి కవితా ప్రాణమూ, సూఫీకవుల రహస్యవాద ప్రాబల్యంగల మహాప్రతిభాశాలి దాశరథి నూతన కవితావిర్భావానికి ప్రధానావిష్కరణంగా గోచరిస్తున్నాడు." ఇక్కడ 'నూతన కవిత' అన్నప్పుడువారు అంతకుముందటి వాక్యాల్లోని అభ్యుదయ కవితానంతర యుగాన్ని గూర్చి మాట్లాడుతున్నట్టు గోచరిస్తుంది. అభ్యుదయ కవితాయుగంపోయిన (?)తర్వాత యుగాన్నివారు ఈ మాట అన్నపక్షంలో, ఒకమాట— ఈ 'నూతన కవితావిర్భావానికి' ఎవరైనా ఆవిష్కర్తలైతే దాశరథికే అభ్యుదయ కవితాప్రేరణ కలిగింపనవకాశమున్న 'శ్రీశ్రీ' కావాలిగాని, భావకవులకూ అభ్యుదయ కవులకూ 'లంకె'గా ప్రారంభించి "ప్రగతివాద దృక్పథంలో వెలువడ్డ కావ్యాలలో దాదాపు చివరిదని చెప్పుకో"దగిన అగ్నిధారాది 'కావ్యాలలో దాశరథి ఆవిష్కర్త' కావడానికి (వ్యక్తిగతంగా ఎవరికైనా ప్రేరణ ఇచ్చివుంటే తప్ప) వీలులేదు.

వచన కవిత్వంలో ప్రయోగించే శిల్పమార్గాలలో కొన్ని అనివారిచ్చిన జాబితాలో "భావానుగుణమయిన 'అంతర్లయ' గాని "పాఠకుణ్ణిపట్టి చదివించే" ప్రవాహగుణం గానీ లేకపోవడం 'కొన్ని' అని వారన్నా కొరతగానే ఉంది.

వ్యాసం చివరి భాగంలో ప్రస్తుత సంకలనంలోని కవులను గురించి చెపుతూ, "వీళ్ళను ఐక్యం చేస్తున్నది ఆధునిక చేతన" అన్నారు. ఆధునిక చేతన ఎవరినైనా (మిగిలినవారిలో) ఐక్యంచేసి ఉండవచ్చును గాని శ్రీసుప్రసన్నగారిని— (వారు వచన కవితా ప్రక్రియను చేపట్టడమొక్కటే ఆధునిక భావచేతనకు నిదర్శనమయితే తప్ప) మాత్రం కాదు.

వారన్నట్లు కేవలము ఐహికదృష్టిఎలా పాక్షికమో, వారివ్యాసంలోనూ, కవితలోనూ నిండివున్న ఆధ్యాత్మిక దృష్టికూడా అంతపాక్షికమే అన్న సత్యాన్ని గుర్తుంచుకోవాలి.

వచ్చే సంచికలో:

చలం సాహిత్య తాత్త్వక సమాలోచన

చేయవలసిందిగా సాహిత్య విమర్శకులయిన రచయితలను కోరుతున్నాము. నవలల సమగ్ర పరిశీలన నవీన్ చేస్తారు. కవిత్వము, కథలు, నాటికలు, నాటకాలు, వ్యాసాలు, తాత్త్విక చింతన మున్నగు అంశాలపై వివిధ దృక్కోణాలనుంచి పరిశీలించి, రాసి ఈ సంచిక తేవడంలోమాతో సహకరించవలసినదిగా రచయితలను కోరుతున్నాము. రచనలు చేరవలసిన ఆఖరుతేది 31 మార్చి 68.

—సంపాదకుడు

సాహిత్యలేఖలు:

"....సృజనలో వ్యాసాలు అయోమయంగా ఉండటంమాట కాదుగాని, తెలుగు పాఠకులు (అభాగ్యులు) చదవవలసిన రచనలయొక్క తత్వం ఎలాంటిదో బెర్ట్రాండ్ రసెల్, టి. యస్. ఇలియట్, బెర్గ్‌సన్, జేమ్స్ జాయిస్, వర్జీనియావుల్ఫ్ కూడానేమో, వీళ్ళనుంచి తెలుసుకోవాలంటే అది నేలవిడిచిన సాము అవుతుందాని నావ్యక్తిగతమైన సందేహం .... మన సాహిత్యం ఇప్పటికే చదివేవాళ్ళకు కొన్నిమైళ్ళ ఎడంలో నడుస్తున్నది. మనకి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా (?) సాహిత్య సామ్రాజ్యవాదంనుంచి విముక్తి లేదా? మనం రచించేవన్నీ విశ్వసాహిత్యపు కొలబద్దలతోనే కొలవాలా? ఇవి rhetorical questions కాదు, నా అనుమానాలు. వాటికి సమాధానాలు తెలుసుకునేదాకా నాకు సృజన వ్యాసాలు కొన్ని అయోమయంగా ఉండటం తప్పనిసరే ననుకుంటాను. కవిత్వం రాసేవాళ్ళకు కొంత pose వేసే అర్హత ఉండవచ్చు. నాబోటి పచ్చి వచనం రాసేవాడికి modesty తప్ప గత్యంతరం లేదు.

మరొక విషయం రాయవలసి ఉంది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా మనవాళ్ళకు 'ఇజము'లమీద ఒక విముఖత్వం పుట్టుకొచ్చింది. దీన్ని బాలగంగాధరతిలక్‌గారే ప్రారంభించారో ఆరుద్రగారో నాకుకచ్చితంగా తెలియదు. వరవరరావుగారి రచనలు కూడచూశాను .... ఈ విముఖత్వాన్ని కొంచెం analyse చేస్తే మార్క్సిజమూ, కమ్యూనిజమూ మాత్రమే కనిపిస్తున్నాయి. హిందూయిజం, బుద్ధిజం, గాంధీయిజం, కాపిటలిజం (సిద్ధాంతమే కాదు) మొదలయినవి ఈ విముఖత్వాన్ని ప్రేరేపించే శక్తి గలవి కావు. అందుచేత తిట్టదలిస్తే కమ్యూనిజం, మార్క్సిజములను పేరుపెట్టే తిట్టవచ్చు. సర్వనామాల చాటున దాగనవసరం లేదు. ఈ రెండు ఇజములనూ అందరూ ఆమోదించాలని నేను అనను. కాని ఏ ఇజమూ అవసరం లేకుండా మనయువకవులు ఎక్కడికి పారిపోదలచారో అదైనా తెలిస్తే బాగుండును. అన్ని ఇజములకూ అతీతమైన జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని నేను తహతహలాడి పోతున్నాను.

ఈనాడు కమ్యూనిస్టు వ్యతిరేకత ఒక తీవ్రమైన, నగ్నమైన, జాతీయ, అంతర్జాతీయ రాజకీయోద్యమంగా తీవ్రరూపం దాల్చుతున్నది. వియత్నాంలో అది ఆదికాలపు దేవదానవ సమరం ప్రమాణాలను అందుకున్నది. (ఎవరు దానవులో నేను

చెప్పనక్కరలేదు.) ఈ సమయంలో మార్క్సిజం లెనినిజం గురించి పార్టీవాళ్ళు గుద్దులాడుకుంటున్నారు. దాన్నిగురించి కవులూ, కథకులూరాసేదేమీ లేదుకూడా. అందుచేత మనయువరచయితలు పారిపోదలిస్తే కమ్యూనిజం నుంచే పారిపోవాలి. మిగతా ఇజములన్నీ absolutely safe...."

—కొడవటిగంటి కుటుంబరావు, మద్రాసు.

" ...ఆధునిక మార్గంలో వచనకవిత కొత్త పుంతలు తొక్కుతూంది. కొంతవరకూ పరిణతినికూడా సాధించిందని నానమ్మకం. వేళాకోళంచేసేవాళ్ళ సంఖ్య సన్నగిల్లిపోతూంది క్రమంగా. చెప్పేదానిలో దేవవుంటే ప్రక్రియ ఏదయితేనేం!

కానీ ఒక విషయం. కవితాప్రక్రియ రాజకీయాలకే తన పరిధిని పరిమితం చేసుకోకూడదు. జీవితంలో కల్లోలాన్ని రేపే అంశాలలో రాజకీయాలుకూడావుండొచ్చు. మనిషిలో విశృంఖలంగా పనిచేస్తున్న శక్తులమాటేమిటి? కనిపించే కల్లోలానికి ప్రత్యేకించి ఒకవర్గాన్ని కారణభూతంగా చూపించడం అన్యాయమేమో నసుకుంటాను. అసలు మనిషిలో ఏదో లోపముంది. ప్రతివాడూ ప్రశ్న వేసేస్థితిలోనే వున్నాడు. జవాబు కోసం తనలోకితాను చూసుకోడు. మనిషి సమగ్రస్వరూపాన్ని చిత్రించడానికి వచన కవితా ప్రక్రియ ప్రయత్నించాలి. మనిషి సమాజంలో భాగంకాబట్టి అప్పుడు సమాజ స్వరూపంకూడా పొడగట్టుతుంది.

సత్యాన్వేషణ కవిపని. కానీ ఆ సత్యాన్వేషణలో ఉదాత్తత వుండాలి. మనిషినీ సమాజాన్నీ తిట్టడంతోనే తనపని అయిపోదు. మెల్లగా మందలించి మార్గనిర్దేశం చేయాలి మామూలుమనిషికి తెలిసిన సంగతులేకాకుండా విశ్వవ్యాప్తంగా ప్రవహించే ఒక అద్భుత చైతన్యాన్నికూడా మనిషి దర్శించేలా చిత్రించడం కవి కర్తవ్యం. సంకుచితమైన పరిధిలో యిరుక్కుపోయి కవి ఈ కర్తవ్యాన్ని విస్మరించరాదు. వచన కవితకప్పుడు మంచి పుష్టి లభిస్తుంది. ఆ గమ్యం వేపుపయనించడమే వచనకవితకు మైలురాళ్ళు నిలపడమవుతుంది. ఈ నాకొన్ని అభిప్రాయాల్ని తెలపడం అసంగతం కాదనుకునే రాశాను.

—పరిగి రాధాకృష్ణ, హైదరాబాదు.

గత సంచికలో అనివార్యంగా దొరలిన అచ్చు తప్పులకు మన్నించండి.—సంపాదకుడు.

కీలక ఉగాదికి మరికొన్ని ఆధునిక సాహిత్య కీలలు

ఆంధ్ర దేశంలో మరికొన్ని సాహిత్య పత్రికల అవతరణ

సంవేదన

(తెలుగు త్రైమాసిక)

సపాదకుడు:

రాచమల్లు రామచంద్రారెడ్డి,

1/514 గాంధీనగర్, కడప.

కళాకేళి

(సాహిత్య మాస పత్రిక)

సంపాదకుడు:

సోమసుందర్,

కాకినాడ.

ప్రతిభ

(వారపత్రిక)

'విశాలాంధ్ర' ప్రచురణ

విజయవాడ

Printed and Published by Varavara rao for 'Sahithee Mithrulu'
at Parvati Printing Press, Jadcherla (Rly. Stn.)
Editor: Varavara rao.